## లంచగొండుల వివరాలు ఏసిబికి తెలపండి

ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులు ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నట్లు, లంచగొండితనానికి పాల్పడుతున్నట్లు ఎలాంటి సమాచారమున్నా అవినీతి నిరోధక శాఖకు తెలియజేయ వలసిందిగా ఏసిబి డైరెక్టర్ జనరల్ ప్రజలను కోరారు. సమాచారం అలందించిన వారుపేరు, వివరాలను గోప్యంగా ఉంచుతామని ఒక ప్రకటనలో తెలిపారు.

**వివరాలకు:**

డైరెక్టర్ జనరల్, అవినీతి నిరోధక శాఖ,
మొజంజాహి మార్కెట్ రోడ్, హైద్రాబాద్ -500 001
ఫోన్: (040) 2475132,



# దేశ టైమ్స్

DESHA TIMES
TELUGU DAILY

తెలుగు దినపత్రిక


## దివ్యాంగులు ఆత్మవిశ్వాసంతో ఎదగాలి

హైద్రాబాద్: దివ్యాంగులు ఆత్మవిశ్వాసంతో స్వతంత్రం గా జీవితంలో ఎదగాలని పీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్, ఎమ్మెల్సీ దయానంద్ గుప్తా, ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్ రెడ్డి రామ్ రెడ్డి అన్నారు. తెలంగాణ ప్రభుత్వం, వికలాంగుల కార్పొరేషన్ ఆధ్వర్యంలో కొత్తపేటలోని రాధా మానసిక వికలాంగుల సంస్థలో దివ్యాంగులకు వాహనాలు పంపిణీ చేశారు. ఎల్బీనగర్ నియోజ కవర్గంలోని పలువురు లబ్ధిదారులకు వాహనాలను అందజేసి, హెల్మెట్లను అందజేశా రు. శిశు సంక్షేమ శాఖ సిబ్బందికి ఫోన్లు అంద జేశారు. ఈ సందర్భంగా మధుయాష్కీ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పేదల సంక్షేమంలో భాగంగా దివ్యాంగులకు వాహనా లను అందజేసి ఒదన్నారు. ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మాట్లా డుతూ. .. దివ్యాంగుల సం క్షేమానికి ప్రభుత్వం మరిన్ని పలు కార్యక్రమాలు అమలు చేయాలన్నారు. కార్యక్రమం లో సీడీపీవో రేణుక, డీడీఆర్సీ రమేశ్, తదితరులు పాల్గొన్నారు.


నల్లగొండ సంపుటి:16 సంచిక:98 ఎడిటర్: సయ్యద్ పాష 26-04-2026 ఆదివారము పేజీలు :8 వెల:1/-


# అలాంటి వ్యాఖ్యలు కరెక్ట్ కాదు



పశ్చిమబెంగాల్ : పశ్చిమబెంగాల్ లో హింసను ప్రేరేపించే వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా పై తాము చట్టపరమైన చర్యలు తీసుకోబోతున్నామని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మమతాబెనర్జి అన్నారు. కేంద్ర హోంమంత్రి హోదాలో ఉన్న వ్యక్తి అలాంటి వ్యాఖ్యలు చేయడం కరెక్ట్ కాదని ఆమె అన్నారు. హోంమంత్రి వ్యాఖ్యలు హింసను ప్రేరేపించేవిగా ఉన్నాయని విమర్శించారు. అలాంటి వ్యాఖ్యలతో బెంగాల్‌లో గెలువాలనుకుంటే ఎప్పటికీ గెలువలేరని స్పష్టంచేశారు. బెంగాల్ ప్రజలు అలాంటి వ్యాఖ్యలను ఏమాత్రం అంగీకరించరని చెప్పారు.హుగ్లీలో జరిగిన ఎన్నికల ప్రచారసభలో మమతాబెనర్జి ప్రసంగించారు. ఈ సందర్భంగా శుక్రవారం కేంద్రహోంమంత్రి చేసిన వ్యాఖ్యలపై ఆమె మండిపడ్డారు. ఎన్నికల ప్రచార సభలో కేంద్ర హోంమంత్రి మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల తర్వాత బెంగాల్‌లోని టీఎంసీ గూండాలను తలకిందులుగా వేలాడదీస్తామని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలను మమత తీవ్రంగా తప్పుపట్టారు. ఆయనపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కాగా పశ్చిమబెంగాల్‌లోని మొత్తం 294 అసెంబ్లీ స్థానాలకు రెండు విడతల్లో ఎన్నికలు నిర్వహిస్తున్నారు.ఏప్రిల్ 23న తొలి విడత ఎన్నికల పోలింగ్ పూర్తయ్యింది. ఏప్రిల్ 29న రెండో విడత పోలింగ్ జరుగనుంది. మే 4న ఓట్లను లెక్కించి ఫలితాలను వెల్లడించనున్నారు. బెంగాల్‌లో అధికార తృణమూల్ కాంగ్రెస్, ప్రతిపక్ష బీజేపీ మధ్యనే ప్రధాన పోటీ నెలకొంది. గతంలో దశాబ్దాల తరబడి బెంగాల్‌ను ఏలిన వామపక్షాలు ఇప్పుడు నామమాత్ర పార్టీలుగా మారిపోయాయి.

# తెలంగాణకు చల్లని కబురు..



నల్లగొండ: తెలంగాణలో భానుడు మహోగ్రరూపం దాల్చుతున్నాడు. శని వారంఉదయం 8 గంటల నుంచే సుర్రుమంటున్నాడు. నిప్పులు కొలిమిని తలపిస్తున్న ఎండలకు తోడు తీవ్ర ఉక్కపోతతో ప్రజలు అల్లాడి పోతున్నారు. హైదరాబాద్‌తో పాటు అన్ని ప్రధాన పట్టణాల్లోనూ రోడ్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి. పెద్దపల్లి జిల్లా అకెనపల్లిలో రాష్ట్రంలోనే అత్యధికంగా 44.3 డిగ్రీల సెల్సియస్ గరిష్ఠ పగటి ఉష్ణోగ్రత రికార్డయింది. జగిత్యాల జిల్లా రాయికల్ మండలం అల్లీపూర్‌లో 44.1 డిగ్రీల సెల్సియస్, కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలం వెదురుగట్టులో 43.8 డిగ్రీల సెల్సియస్, రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లిలో 43.4 డిగ్రీల సెల్సియస్ గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోద య్యాయి.రాబోయే 3 రోజులు గరిష్ఠ ఉష్ణోగ్రతలు 45 డిగ్రీల స్థాయిలోనే నమోదవుతాయని, తీవ్రమైన వడగాలులు ఉంటాయని తెలంగాణ వెదర్‌మ్యాన్ హెచ్చరించారు. కనిష్ఠంగా రాత్రి ఉష్ణోగ్రతలు 29-30 డిగ్రీలకు పెరుగుతాయని తెలిపారు. గాలిలో తేమ ఉదయం 30-50 శాతం, మధ్యాహ్నం 10-15 శాతం వరకు ఉంటుందని అన్నారు. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాల, నిజామాబాద్ వంటి ఉత్తర తెలంగాణ జిల్లాల్లో తీవ్రమైన వేడిమి ఉంటుందని అన్నారు. కొన్నిచోట్ల ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలకు చేరనుండగా... హైదరాబాద్‌లో కొన్నిచోట్ల ఉష్ణోగ్రతలు 43 డిగ్రీల సెల్సియస్ చేరుకుంటాయన్నారు. ఇక ఏప్రిల్ 28 నుంచి ఉరుములతో కూడిన వర్షాలు కురుస్తాయని చెప్పారు. మొదట దక్షిణ, పశ్చిమ తెలంగాణలో ప్రారంభమై.. ఆ తర్వాత హైదరాబాద్ నగరంతో సహా ఇతర ప్రాంతాలకు వ్యాపిస్తాయన్నారు.ఎండల తీవ్రత.. ఈ జాగ్రత్తలు తీసుకోండి తీవ్రమైన ఎండల నుంచి ప్రాణాలను కాపాడుకోవడానికి తగిన జాగ్రత్తలు పాటించాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ప్రధానంగా మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అత్యవసరమైతే తప్ప బయటకు రాకపోవడమే మంచిదని అంటున్నారు. బయటకు వెళ్లాల్సి వస్తే తెల్లని కాటన్ వస్త్రాలు ధరించాలని.., తలకు టోపీ లేదా గొడుగు వాడాలని సూచిస్తున్నారు.

# బీజేపీ వస్తే రాత్రి ఒంటిగంటకైనా మహిళలు బయుట తిరగొచ్చు



జమాల్‌పూర్, మే ఐదో తేదీ తర్వాతి నుంచి పశ్చిమ బెంగాల్ మహిళలు రాత్రి ఒంటి గంట తర్వాత కూడా భయం లేకుండా రోడ్లపై తిరగొచ్చని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా పేర్కొన్నారు. పశ్చిమ బెంగాల్‌లోని పూర్బ బర్ధమాన్ జిల్లాలోని జమాల్‌పూర్ గ్రామంలో జరిగిన ఎన్నికల ర్యాలీలో అమిత్ షా పాల్గొన్నారు. రాష్ట్రంలో మహిళల భద్రత విషయంలో విఫలమయ్యారని ముఖ్యమంత్రి మమతా బెనర్జీపై విమర్శలు గుప్పించారు. ప్రస్తుతం బెంగాలీ మహిళలు భయంతో జీవిస్తున్నారని అన్నారు.మహిళలు సాయంత్రం ఏడు తర్వాత బయటికి రావొద్దంటూ మమతా బెనర్జీ గతంలో చేసిన వ్యాఖ్యలను అమిత్ షా విమర్శించారు. 'ఒక మహిళా ముఖ్యమంత్రి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సరైన పాలనకు సంకేతమా?' అని ప్రశ్నించారు. భారతీయ జనతా పార్టీ అధికారంలో ఉన్న అన్ని రాష్ట్రాల్లోనూ మహిళలు ధైర్యంగా ఉన్నారని, మే 5 తర్వాత బెంగాలీ మహి ళల పరిస్థితి కూడా మెరుగుప డుతుందని అన్నారు. తల్లులు, సోదరీమణుల వైపు దురుద్దేశంతో చూసేందుకు ఏ దుండగుడు సాహసించినా, వారిని జైలులో పెడతామని భారతీయ జనతా పార్టీ హామీ ఇస్తుందన్నారు.'గత పదిహేను సంవత్సరాల మమతా బెనర్జీ పాలనలో, అత్యధికంగా నష్టపోయిన వారు మన తల్లులు, సోదరీమణులే . బెంగాల్‌లో మహిళలపై ఎన్నో హింసాత్మక ఘటనల జరిగాయి. మహిళలు రాత్రి 7 గంటల తర్వాత ఇళ్ల నుంచి బయటకు రాకూడదని దీదీ అంటున్నారు. నేను మీకు చెప్పేదేమిటంటే.. 5వ తేదీ తర్వాత, యువతులు రాత్రి 1 గంట తర్వాత కూడా బయటకు రాగలరు. ఏ దుండగుడూ ఆమె వైపు చూడటానికి కూడా సాహసించడు' అని అమిత్ షా హామీ నిచ్చారు.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలంగాణలో వచ్చే నెల 9వ తేదీన పర్యటించనున్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలంగాణలో వచ్చే నెల 9వ తేదీన పర్యటించనున్నారు. ప్రధాని పర్యటనలో భాగంగా సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించే అవకాశం ఉంది. ఈ పర్యటనలో ప్రధానంగా రాష్ట్రంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రధాని శంకుస్థాపన చేయనున్నారని తెలుస్తోంది. అలాగే ఇప్పటికే పూర్తయిన కొన్ని ప్రాజెక్టులను జాతికి అంకితం చేసే కార్యక్రమాలు కూడా ఉండే అవకాశము ంది.ముఖ్యంగా2ను జాతికి అంకితం చేసే అంశం ఈ పర్యటనలో ప్రధానంగా ఉండొచ్చని సమాచారం. హైదరాబాద్ నగర రవాణా వ్యవస్థను మెరుగుపరిచే ఈ ప్రాజెక్ట్ ప్రజా ప్రయాణానికి కీలకంగా మారనుంది. అలాగే ఎయిమ్స్ బీబీనగర్ ఆస్పత్రిని కూడా జాతికి అంకితం చేసే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఈ ఆస్పత్రి తెలంగాణతో పాటు సమీప రాష్ట్రాల ప్రజలకు కూడా వైద్యసేవల్లో పెద్ద మార్పు తీసుకురానుంది. ఇవే కాకుండా రాష్ట్రంలో పలు జాతీయ రహదారుల అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రధాని శంకుస్థాపనలు చేయనున్నారని సమాచారం.రవాణా, కనెక్టివిటీ రంగాల్లో ఈ ప్రాజెక్టులు కీలకమని ప్రభుత్వ వర్గాలు భావిస్తున్నాయి. ఇక మరో అంశంగా మల్లారెడ్డి యూనివర్సిటీ పర్యటన కూడా ప్రధాని షెడ్యూల్ లో ఉండొచ్చని చర్చ జరుగుతోంది. అయితే ఇది ఇంకా అధికారికంగా ఖరారు కాలేదని తెలుస్తోంది. ప్రధాని మోదీ పర్యటన తెలంగాణ అభివృద్ధి ప్రాజెక్టుల ప్రారంభాలు, రవాణా మౌలిక సదుపాయాల విస్తరణ, ఆరోగ్య రంగంలో కొత్త సదుపాయాలపై కేంద్రీకృతమై ఉండే అవకాశాలు ఉన్నాయి. ప్రధాని అధికారిక షెడ్యూల్ పూర్తిగా ప్రకటించాల్సి ఉంది.

# ఆర్టీసీ బలోపేతానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది



హైదరాబాద్, : తెలంగాణ ఆర్టీసీని మరింత బలోపేతం చేయడానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యానించారు. రెండు రోజుల పాటు జరిగిన సమ్మె సమయంలోనే కార్మికులతో పలుమార్లు చర్చలు జరిపామని, వారి ప్రధాన డిమాండ్లను పరిష్కరించామని పేర్కొన్నారు. ఈరోజు (శని వారం) ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్‌లు. అధికార ప్రతినిధులు, కాంగ్రెస్ డీసీసీ అధ్యక్షులతో మంత్రి పొన్నం ప్రభాకర్ జూమ్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ మాట్లాడారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం కార్మికుల చిరకాల స్వప్నమని, దాన్ని తాము నెరవేర్చామని పేర్కొన్నారు.అలాగే కార్మిక సంఘాల ఎన్నికలు, 11శాతం పీఆర్సీ ప్రకటించడం వంటి అంశాలపై ఆర్టీసీ సిబ్బంది సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఈ నిర్ణయాలను చారిత్రాత్మకంగా అభివర్ణిస్తూ కార్మికులు సంబరాలు జరుపుకోవాలని నిర్ణయించారని.. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ కేడర్ కూడా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రుల బృందం సుమారు 15 గంటలపాటు కార్మికులతో చర్చలు జరిపి సమస్యలకు పరిష్కారం చూపామని తెలిపారు. ఇంకా మిగిలిన సమస్యలనూ కూడా దశలవారీగా పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని స్పష్టం చేశారు. కేసీఆర్ హయాంలో ఆర్టీసీ కార్మికులు 55 రోజులపాటు సమ్మె చేసినా, వారి డిమాండ్లు నెరవేర్చలేదని విమర్శించారు.ఆ సమయంలో 30 మందికి పైగా కార్మికులు ప్రాణాలు కోల్పోయారని మంత్రి పొన్నం ప్రభాకర్ గుర్తు చేశారు. తమ ప్రభుత్వానికి కార్మికులతో విభేదాలు లేవని, వారిని కుటుంబ సభ్యుల్లా భావిస్తున్నామని చెప్పారు. సమ్మె సమయంలో ఆత్మహత్య చేసుకున్న శంకర్ గౌడ్ కుటుంబానికి తమ ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా కల్పించారు. కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ శవ రాజకీయాలు చేయడం తగదని హితవు పలికారు. సమ్మె సమయంలో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు వ్యవహరించిన తీరు సరికాదని అభిప్రాయపడ్డారు. 2013 బాండ్లు, 2017 పీఆర్సీ, డీఏలు, సీసీఎస్, పీఎఫ్ బకాయిల చెల్లింపులు, కొత్త బస్సుల కొనుగోలు, ఉద్యోగాల భర్తీ, కారుణ్య నియామకాలు వంటి అనేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. అలాగే సర్వీసు నుంచి తొలగించిన కార్మికులను తిరిగి ఉద్యోగాల్లోకి తీసుకున్నామని ప్రస్తావించారు. ప్రస్తుతం రోజుకు సుమారు 65 లక్షల మంది ప్రయాణికులు ఆర్టీసీ సేవలను వినియోగిస్తున్నారని తెలిపారు. పేదలకు విద్య, వైద్యం, ఉపాధి అవకాశాల కోసం ఆర్టీసీ ఒక లైఫ్ లైన్‌లా పనిచేస్తోందని మంత్రి పొన్న ప్రభాకర్ పేర్కొన్నారు.

# తెలంగాణ ప్రజలను... తప్పుదోవ పట్టిస్తున్నారు



భువనగిరి :కల్వకుంట్ల కవిత కొత్త పార్టీపై కాంగ్రెస్ భువనగిరి లోక్‌సభ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ రాష్ట్ర సేన పార్టీ పెట్టినందుకు ఆమెకు ధన్యవాదాలు తెలిపారు. అమ్మగా జేబులు చూసి కాదని.. కడుపు చూసి పాలిస్తానని కవిత చెప్పారని ప్రస్తావించారు. ఈరోజు (శనివారం) హైదరాబాద్ వేదికగా కిరణ్ కుమార్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్ పదేళ్ల అధికారంలో ఉన్నప్పుడు జేబులు చూసి పరిపాలించారని కవిత చెప్పారని అన్నారు. నీళ్లు, నిధులు, నియామకాల పేరుతో గతంలో టీఆర్ఎస్‌ను ఏర్పాటు చేశారని ప్రస్తావించారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడే కవిత బయటకు వచ్చి పార్టీ పెట్టి ఉంటే ప్రజల్లో మంచి ఆదరణ వచ్చేదని చెప్పుకొచ్చారు.నీళు ్ల, నిధులు, నియామకాల పేరుతో తెలంగాణను కేసీఆర్ హయాంలో దోపిడీ చేశారని ఎంపీ చామల ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ హయాంలోని పదేళ్ల కవిత ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. పంచుకునే వాటాల్లో తేడాలు వచ్చి ఆమె బయటకు వచ్చారని తెలంగాణ ప్రజలు భావిస్తున్నారని అన్నారు. కవిత ఇప్పుడు బయటకు వచ్చి సీఎం, సీఎం అని నినాదాలు చేయించుకుంటున్నారని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డిని కర్కోటకుడు, హిట్లర్ అంటే కవితకు మార్కులు పడవని ఆక్షేపించారు. రేవంత్‌రెడ్డి రైతు రుణమాఫీ, ఫ్యూచర్ సిటీ, ఉద్యోగాలు, మూసీ ప్రక్షాళన చేస్తున్నందుకు కర్కోట కుడు అయ్యారా...? అని ఫైర్ అయ్యారు. కవిత.. నిర్మాణాత్మక రాజకీయాలు చేస్తే స్వాగతిస్తాం..కవిత పార్టీ పెట్టుకోవచ్చని, పోరాటం చేయొచ్చని, ప్రజల్లోకి వెళ్లవచ్చని తెలిపారు. తెలంగాణను దోచుకోవడానికే ఆమె సీఎం కావాలని అంటున్నారా..? అని నిలదీశారు. కవిత నిర్మాణాత్మక రాజకీయాలు చేస్తే స్వాగతిస్తామని తెలిపారు. ఆమె తెల్లకాగితం కాదని.. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఎంపీగా, ఎమ్మెల్సీగా ఆమె పని చేశారని ప్రస్తావించారు. తెలంగాణ ప్రజలను కవిత తప్పుదోవ పట్టిస్తున్నారని.. తెలంగాణ ప్రజలు ఆమెను నమ్మరని కిరణ్ కుమార్ రెడ్డి విమర్శించారు.

# కొత్త రాజకీయ పార్టీ ప్రకటించిన కవిత – 'టీఆర్ఎస్'గా నామకరణం



హైద్రాబాద్: మేడ్చల్ జిల్లా మునీరాబాద్ వేదికగా నూతన రాజకీయ పార్టీ ఆవిర్భవించింది. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తన కొత్త పార్టీని ప్రకటించారు. పార్టీకి 'తెలంగాణ రాష్ట్ర సేన'గా నామకరణం చేసినట్లు ఆమె వెల్లడించారు. నేడు పార్టీ ప్రకటన నేపథ్యంలో ఉదయం ఇంట్లో సర్వమత ప్రార్థనలు నిర్వహించిన కవిత, తన భర్త, కుటుంబ సభ్యుల ఆశీర్వాదం తీసుకున్నారు.ఉదయం పది గంటలకు మునీరాబాద్ సమీపంలోని ఓ కన్వెన్షన్ హాల్‌లో రాజకీయ పార్టీ ఆవిర్భావ సభ జరిగింది. పార్టీ పేరు ప్రకటన సహా జెండా, ఎజెండాను కవిత వెల్లడించారు. అంతకుముందు గన్ పార్క్ వద్ద తెలంగాణ అమరవీరులకు నివాళులు అర్పించిన అనంతరం పార్టీ ఆవిర్భావ సభకు హాజరయ్యారు. అమరవీరుల కుటుంబాలతో పాటు ఉద్యమకారులు ఈ సమావేశానికి హాజరయ్యారు. అన్ని జిల్లాల నుంచి సభకు జనాన్ని సమీకరించారు. ఆవిర్భావ సభకు హాజరైన కార్యకర్తలు, అతిథులకు 35 రకాల తెలంగాణ రుచులతో భోజనాలు ఏర్పాటు చేశారు.ఇది నా జీవితంలో మరిచిపోలేని రోజు అవుతుంది. తెలంగాణ భవిష్య త్తు రాసుకోవడానికి మనందరి భాగస్వామ్యం కావాలి. పని చేయడం కోసమే తెలంగాణ రాష్ట్ర సేన ప్రజల ముందుకు వచ్చింది. మా పనితీరు ఎలా ఉంటుందో ప్రజలు చూస్తారు. ప్రజలకు మంచి చేయాలంటే పోరాడితే సరిపోదు, రాజకీయ అధికారం ఉండాలి. రాజకీయ అధికారం తోడైతేనే ప్రజలకు మంచి చేయగలం. ఏ పార్టీకైనా ఆత్మ, నేపథ్యం ఉండాలి. బీఆర్ఎస్ సాంకేతికంగా ఉన్నా, ఆత్మను కోల్పోయింది. బీఆర్ఎస్ తెలంగాణ ఆత్మ కోల్పోయినందుకే తెలంగాణ రాష్ట్ర సేన వచ్చింది.కేసీఆర్ మారినందునే యుద్ధం చేస్తున్నా : కేసీఆర్‌కు అధికారం ముందు మమకారం తగ్గిపోయిందా? అని కవిత ప్రశ్నించారు. కేసీఆర్ రాజకీయ పరిణతి కోల్పోయి మాట్లాడుతున్నారని, కేటీఆర్‌కు ఏమీ తెలియనందున ఆయన మాట్లాడినా పట్టించుకోరని, ప్రజలు తప్పు చేశారని కేసీఆర్ చెబుతున్నారని, ప్రజలు తప్పు చేసి మీకు అధికారం ఇవ్వకపోతే వదిలేస్తారా? అని నిలదీశారు. రాష్ట్రంలో కర్కోటకుడి పాలన నడుస్తోం దని, ప్రజలు గోస పడుతున్నారని ఆరోపించారు. హైడ్రా పేరుతో ఇళ్లు కూల్చుతుంటే ఆదుకోవాల్సిన కేసీఆర్ ఎక్కడున్నారని నిలదీశారు. తనను పార్టీలో నుంచి బయటకు పంపితే వెంటనే పార్టీ పెట్టలేదని, మారతారేమోనని వేచి చూశానని, పది నెలలైనా మారలేదని అన్నారు. తనకు నిజంగా బాగానే జరిగిందని, ఆనాడు ఉద్యమకారులను ఇబ్బంది పెడుతుంటే ఇంకా గట్టిగా మాట్లాడాల్సిందని తెలిపారు. ఆనాడు మీకు జరిగిందే, ఇవాళ తనకు జరిగిందని ఉద్యమకారులను ఉద్దేశించి అన్నారు. కండువా వేసుకుని తిరిగిన ఉద్యమకారులకు సరైన గుర్తింపు రాలేదని, అధికారం వచ్చిన తర్వాత అమ్మతనం, మమకారం పోయిందని విమర్శించారు.కేసీఆర్ మారినందునే తాను నిలబడి యుద్ధం చేస్తున్నానని వెల్లడించారు. తెలంగాణ గడ్డకు ప్రాణాలు అడ్డుపెట్టి ప్రజలను కాపాడే వ్యక్తులు కావాలని, తెలంగాణ ప్రజలను కాపాడే సైన్యంగా మారేందుకు సిద్ధంగా ఉండాలని అన్నారు. ఉద్యమ సమయంలో మాదిరిగా ఇప్పుడూ పని చేయాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. ఒక్క పాలమూరు-రంగారెడ్డి మాత్రమే కాదు కాళేశ్వరంలో అవినీతి జరిగిందని, తన బిడ్డ, కుమారుడు తప్పు చేస్తే పార్టీ నుంచి తొలగిస్తానని నాడు కేసీఆర్ చెప్పారని, తాను ఏ తప్పు చేశానని ప్రశ్నించారు. కాళేశ్వరంలో అవినీతి జరిగిందని చెప్పానని, అందుకు తనను బయటకు పంపారని తెలిపారు. అవినీతి చేసిన పందికొక్కులను పక్కన కూర్చోపెట్టుకున్నారని, ఆత్మ లేని మరబొమ్మలా కేసీఆర్ మారారని, అందుకే పోరాడుతున్నానని పేర్కొన్నారు. తనతో కలిసి పోరాడేందుకు అందరూ సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ అనేక తప్పులు చేస్తోందని విమర్శించారు.కర్కోటక సీఎం పాలనలో ఉన్నాం : ఇప్పుడే ఇల్లు అలికామని, ముందుంది మొసళ్ల పండుగ అని కవిత పేర్కొన్నారు. ఖమ్మం వెలుగుమట్లలో అన్ని పత్రాలు ఉన్నా అర్ధరాత్రి ఇల్లు కూల్చారని, నిండు గర్భిణీకి అబార్షన్ జరిగితే ఆమె తండ్రి రోదన తన చెవిలో మార్మోగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే ఇప్పుడున్న సీఎంను కర్కోటకుడని, హిట్లర్ అనే అంటానని తీవ్ర స్థాయిలో విమర్శించారు. కర్కోటక సీఎం పాలనలో ఉన్నామని, కచ్చితంగా కొట్లాడాల్సిందేనని, పిడికిలి బిగించి రాక్షస కాంగ్రెస్‌పై అందరి కంటే ఎక్కువ కొట్లాడతామని స్పష్టం చేశారు.పిడికిలి బిగించి కొట్లాడాం : తన జీవితంలో మరిచి పోలేని రోజు అవుతుందని కల్వకుంట్ల కవిత తెలిపారు, తెలంగాణ భవిష్యత్తు రాసుకోవడానికి మనందరి భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. తెలంగాణ కోసం అనేక కష్టాలు పడి పిడికిలి బిగించి కొట్లాడామని గుర్తు చేశారు. తెలంగాణ ఉద్యమంలో తెలంగాణ జాగృతి కీలకపాత్ర పోషించిందని కొనియాడారు. తెలంగాణ ఉద్యమంలో ఆడబిడ్డలందరూ భాగస్వామ్యం అయ్యారని, జాగృతి కార్యకర్తలు తెలంగాణ సాంస్కృతిక దీపాన్ని పదిలంగా కాపాడుకున్నారని, కాలరాత్రిలో కాగడాలా తెలంగాణ ఉద్యమకారులకు వెలుగునిచ్చిందని తెలిపారు. తెలంగాణ సమాజానికి కాంతిరేఖగా మారిందని, మరోసారి బతుకమ్మను ప్రపంచానికి పరిచయం చేసుకున్నామని అన్నారు. జాగృతి కార్యకర్తలు ఉద్యమానికి బలమైన సాంస్కృతిక పునాది ఇచ్చారని, ఏ కలలతో తెలంగాణ తెచ్చుకు న్నామో అవి నిజం కాలేదని విమర్శించారు. తెలంగాణ ప్రజలకు క్షమాపణలు : కేసీఆర్ నేతృత్వ ంలో తెలంగాణ ఉద్యమ రథం దారి తప్పిందని, తెలంగాణ ప్రజల ఆర్తిని అర్థం చేసుకోలేకపోయిందని, సామాజిక తెలంగాణ రథ చక్రం విరిగి ముక్కలైందని , కొత్త రాష్ట్రంలో జరగాల్సిన పనులు సరిగా జరగలేదని విమర్శిం చారు. తెలంగాణ వస్తే బానిస సంకెళ్లు పోతాయని భావించామని, రైతులకు బేడీలు పడ్డాయని, ఇసుక దందా వల్ల దళితులు దెబ్బలు తిన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫోన్లు ఎక్కడ పర్యవేక్షిస్తున్నారోనని భయం, వ్యక్తిగత స్వేచ్ఛ లేదని తెలిపారు. దారుణమైన నిఘా నీడలో తెలంగాణ అంతా బతికిందని, మనం అనుకున్న తెలంగాణ రాలే దనేది ముమ్మాటికీ వాస్తవమని, ఆనాడు పరిపా లించిన కుటుంబంలో తాను కూడా ఒక భాగమని గుర్తు చేశారు.

# మే 11 నుంచి ప్రతి ఇంటికి మార్కు

హైదరాబాద్: జనగణన తెలంగాణ డైరెక్టర్ భారతి హెలికేరి శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో జనాభా లెక్కల సేకరణ వివరాలను వెల్లడించారు. ఆస్పత్రి బడి, గుడి, గుడిసె, అద్దె భవనం ఏదైనా గణన జరుగుతోందని చెప్పారు. తెలంగాణ భౌగోళిక పరిధిలో ఉన్న ప్రతి ఇల్లు గణన ఉంటుందని సూచించారు. భవనంలో ఉన్న ప్రతి ఒక్క కుటుంబాన్ని పరిగణలోకి తీసుకుంటామని వివరించారు.2027 ఫిబ్రవరిలో రెండో దశ మొదలయ్యేలోగా అంతా సిద్ధంగా చేస్తామని భారతి హెలికేరి వెల్లడించారు. 2027 ఫిబ్రవరి నుంచి రెండో దశలో వ్యక్తిగత సమాచారం సేకరిస్తామన్నారు. ఇళ్ల గణన కోసం బ్లాకులుగా విభజించి ఎన్యుమరేటర్లను కేటాయిస్తామని తెలిపారు. మే 11 నుంచి జూన్ 9 వరకు ఎన్యుమరేటర్లు ప్రతి ఇంటికి మార్కు చేస్తారని జనగణన తెలంగాణ డైరెక్టర్ వెల్లడించారు. ప్రతి భవనంలో ఎన్ని ఇళ్లు ఉన్నాయనేది మార్కు చేస్తారని సూచించారు.

# దేశ టైమ్స్


## సంపాదకీయం

### రోజు దినపత్రికలను తిరగేసేవారికి రోడ్డు ప్రమాదాలు జరగని రోజంటూ ఉండదేమో అనిపించకమానదు...

నిత్యం ప్రమాదాలతో రహదారులు రక్తమోడుతున్నాయి. రోజూ దినపత్రికలను తిరగేసేవారికి రోడ్డు ప్రమాదాలు జరగని రోజంటూ ఉండదేమో అనిపించకమానదు. ఇంట్లోంచి బయటకు వెళ్లిన వ్యక్తి తిరిగి వచ్చేంతవరకూ ప్రాణాలకు హామీ లేదంటే అతిశయోక్తి కాదు. ఏవైపునుంచి ఏ వాహనం మీదకు దూసుకువస్తుందో, ఏ మూలమలుపులో మృత్యుదేవత మాటువేసుకుని కూర్చుందో తెలియదు. తాజాగా జమ్మూకశ్మీర్‌లోని ఉధంపూర్ సమీపాన ఓ బస్సు లోయలో పడి, 21 మంది కన్నుమూసిన ఘటన దిగ్భ్రాంతికరం. కొండప్రాంతంలో బస్సు ప్రయాణిస్తుండగా మూలమలుపు వద్ద దారి కనబడకపోవడంతోనే బస్సు లోయలో పడిపోయినట్లు ప్రాథమిక సమాచారాన్ని బట్టి తెలుస్తోంది. కారణాలు ఏవైనా, ప్రమాదం జరిగాక మృతుల బంధువులకు మిగిలేది తీరని శోకమే. ప్రమాదం మిగిల్చిన అవకరాలతో క్షతగాత్రులు జీవితాంతం దీనంగా బతుకు ఈడ్వవలసిందే. ప్రభుత్వాలు అప్పటికప్పుడు లక్షల్లో నష్టపరిహారాలను ప్రకటించవచ్చుగాక, అవేవీ కోల్పోయిన తమ బంధువులను తిరిగి తీసుకురావడానికి ఎంతమాత్రం సహాయపడవు కదా. వాహనాలను నడిపేటప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలపై చోదకుల నిర్లక్ష్యం, పరిమితికి మించి అతివేగంగా నడపడం వంటివి ప్రమాదాలకు ప్రధాన హేతువులు కాగా, వాహనాలలోని సాంకేతిక లోపాలు సైతం పదుల సంఖ్యలో ప్రాణాలను కబళిస్తున్న సంఘటనలు ఇటీవలి కాలంలో ఎక్కువయ్యాయి. స్లీపర్ బస్సులలో ఉన్నపళంగా మంటలు చెలరేగి, అందులో ఉన్న ప్రయాణికులు సజీవంగా ఆహుతి అవుతున్న సంఘటనలు దేశవ్యాప్తంగా చోటుచేసుకుంటున్నాయి. మొన్నటికి మొన్న హైదరాబాద్ నుంచి రాత్రివేళ బయల్దేరిన ఓ ప్రవేటు బస్సు, బయల్దేరి నాలుగు కిలోమీటర్లు దాటిందో లేదో మంటల్లో చిక్కుకోవడం ఈ తరహా ప్రమాదాలు ఎక్కువవుతున్నాయనడానికి నిదర్శనం. ఇలాంటి ప్రమాదాలకు గల కారణాలపై నిపుణులతో అధ్యయనం జరిపించాలన్న ఆలోచన, ఒకవేళ అధ్యయనాలు జరిగినా వాటి ఆధారంగా చర్యలు తీసుకోవాలన్న చిత్తశుద్ధి పాలకుల్లో లోపిస్తున్నాయి. ప్రపంచంలోని వాహనాలలో భారతదేశంలో ఉన్నవి కేవలం ఒక్క శాతమే అయినా రోడ్డు ప్రమాదాల సంఖ్యలో మాత్రం మన దేశం అగ్రస్థానంలో ఉండటం శోచనీయం. ఏటా భారతదేశంలో 4.8 లక్షల ప్రమాదాలు జరుగుతుంటే, అందులో లక్షా డబ్భైవేలమంది వరకూ ప్రాణాలు కోల్పోతున్నారట. దేశంలో సగటున రోజూ 474 మంది రోడ్డు ప్రమాదాలకు బలవుతున్నారని గణాంకాలు చెబుతున్నాయి. అమెరికా తర్వాత ప్రపంచంలోనే అతి పెద్ద రహదారి నెట్ వర్క్ ఉన్నది భారతదేశంలోనే. కానీ, ఇక్కడ జాతీయ, ప్రధాన రహదారులలో అనేక లోపాలు ఉన్నాయని, బ్లాక్ స్పాట్లుగా గుర్తించిన చోట్ల కూడా మరమ్మతులు అనుకున్నంత వేగంగా సాగడం లేదని కేంద్ర రోడ్డు రవాణా మంత్రే స్వయంగా పార్లమెంటులో ఆ మధ్య వాపోవడం మన రహదారుల దుస్థితికి అద్దం పడుతోంది. రోడ్డు ప్రమాదాలపై సందర్భం వచ్చినప్పుడల్లా సర్వోన్నత న్యాయస్థానం చీవాట్లు పెడుతూనే ఉన్నా, అవేవీ పాలకుల చెవికి ఎక్కడం లేదు. రాజస్థాన్ లోని ఫలోడి, తెలంగాణలోని రంగారెడ్డి జిల్లాల్లో గత ఏడాది నవంబర్ 2, 3 తేదీల్లో జరిగిన రోడ్డు ప్రమాదాలను సుమోటోగా స్వీకరించిన సుప్రీంకోర్టు ఈ ప్రమాదాలకు కారణాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసిన అనంతరం దేశవ్యాప్తంగా అమలు చేయాల్సిన మార్గదర్శకాలను రెండు రోజుల క్రితమే ప్రకటించింది. సురక్షితమైన రహదారి ప్రయాణం రాజ్యాంగంలోని జీవించే హక్కు (ఆర్టికల్ 21) లో అంతర్భాగమని, ప్రమాద రహిత ప్రయాణం ప్రతి పౌరుడి హక్కు అని స్పష్టం చేసిన సుప్రీంకోర్టు పాలనాపరమైన నిర్లక్ష్యం, మౌలిక సదుపాయాల కల్పనలో లోపాలే ప్రాణనష్టానికి కారణమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేసింది. ఇదే సందర్భంలో రహదారి భద్రతను రాజ్యాంగాబద్ధమైన బాధ్యతగా పేర్కొంటూ మార్గదర్శకాలు జారీ చేసింది. నిర్దేశిత ప్రాంతాల్లో మినహా భారీ వాహనాలను జాతీయ రహదారులపై ఎక్కడబడితే అక్కడ నిలపకూడదని, రియల్ టైమ్ అలెర్టులు, జిపిఎస్ ఆధారిత ఫోటోగ్రాఫిక్ సాక్ష్యాలు, ఇ- చలాన్ల ద్వారా ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనపై చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. ప్రతి జిల్లాలో జాతీయ రహదారులు ఉన్న చోట జిల్లాస్థాయిలో రహదారి భద్రత టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించింది. ప్రమాదాలు ఎక్కువగా జరిగే బ్లాక్ స్పాట్లను గుర్తించి వాటిపై దృష్టిపెట్టాలని హితవు చెప్పింది. సుప్రీంకోర్టు ఆదేశాలను శిరోధార్యంగా భావించి, అమలు చేయవలసిన బాధ్యత ప్రభుత్వాలదే. ప్రమాదం జరిగినప్పుడల్లా దిగ్భ్రాంతి వ్యక్తం చేసి, నష్ట పరిహారం ప్రకటించి చేతులు దులుపుకోగానే సరిపోదని గుర్తించాలి.

## దివ్యాంగులు ఆత్మవిశ్వాసంతో ఎదగాలి

హైద్రాబాద్: దివ్యాంగులు ఆత్మవిశ్వాసంతో స్వతంత్రంగా జీవితంలో ఎదగాలని పీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్, ఎమ్మెల్సీ దయానంద్ గుప్తా, ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్ రెడ్డి రామ్ రెడ్డి అన్నారు. తెలంగాణ ప్రభుత్వం, వికలాంగుల కార్పొరేషన్ ఆధ్వర్యంలో కొత్తపేటలోని రాధా మానసిక వికలాంగుల సంస్థలో దివ్యాంగులకు వాహనాలు పంపిణీ చేశారు. ఎల్బీనగర్ నియోజకవర్గంలోని పలువురు లబ్ధిదారులకు వాహనాలను అందజేసి, హెల్మెట్లను అందజేశా రు. శిశు సంక్షేమ శాఖ సిబ్బందికి ఫోన్లు అంద జేశారు. ఈ సందర్భంగా మధుయాష్కీ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పేదల సంక్షేమంలో భాగంగా దివ్యాంగులకు వాహనాలను అందజేసి ఒదన్నారు. ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మాట్లాడుతూ. .. దివ్యాంగుల సం క్షేమానికి ప్రభుత్వం మరిన్ని పలు కార్యక్రమాలు అమలు చేయాలన్నారు. కార్యక్రమం లో సీడీపీవో రేణుక, డీడీఆర్సీ రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

## సవాళ్లను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి

ఘట్ కేసర్, : విద్యార్థులు భవిష్యత్ సవాళ్లను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని ఉస్మానియా యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కుమార్ మొలుగారం అన్నారు. ఘట్ కేసర్ డివిజన్ ఘనపూర్‌లోని కొమ్మూరి ప్రతాపరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో అంతర్జాతీయ సదస్సును నిర్వహించారు. ఈసదస్సు ప్రారంభోత్స వానికి ముఖ్య అతిథిగా ఉస్మానియా యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కుమార్ మొలుగారం విచ్చేసి సభను ఉద్దేశించి ప్రసంగించారు. ఆయన తన ప్రసంగంలో ఆధునిక సాంకేతికతలు, పరిశోధన, నవీన ఆవిష్కరణల ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థులు, పరిశోధకులు భవిష్యత్ సవాళ్లను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. అంతేకాకుండా అంతర్జాతీయ సదస్సులు విద్యా సంస్థల అభివృద్ధికి గ్లోబల్ స్థాయి పరిజ్ఞాన మార్పిడికి ముఖ్య వేదికలని ఆయన పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో సంస్థ ఛైర్మన్ కొమ్మూరి ప్రతాప్ రెడ్డి, వైస్ ఛైర్మన్ కొమ్మూరి ప్రశాంత్, డైరెక్టర్ స్ట్రాటజీ కొమ్మూరి దివ్య, డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ బి. సుధీర్ ప్రేమ్ కుమార్, ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్. శ్రీనాథ్ కశ్యప్, ప్రిన్సిపల్ డాక్టర్ కె. శ్రీనివాస రెడ్డి, పాల్గొని సదస్సు విజయవంతం కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సదస్సు కన్వీనర్ డాక్టర్ పి. సత్యనారాయణ ప్రసంగించారు.

## ఇంధన బాదుడుతో విమానాల కోత..

న్యూఢిల్లీ: పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు నేల మీద మాత్రమే కాదు, ఆకాశంలో ప్రయాణించే సామాన్యుడి జేబుకు కూడా చిల్లు పెడుతున్నాయి. చమురు ధరల పెరుగుదల వల్ల విమానయాన రంగం సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. మధ్య ప్రాచ్యంలో అమెరికా, ఇజ్రాయెల్ – ఇరాన్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతలు ప్రపంచ వాణిజ్యానికి గుండెకాయ వంటి చమురు సరఫరాను దెబ్బతీశాయి. దీనివల్ల విమానాల్లో వాడే జెట్ ఇంధనం ధరలు ఊహించని రీతిలో పెరిగాయి. యుద్ధం ప్రారంభం కాకముందు టన్నుకు వి831 ఉన్న ధర, ఇప్పుడు వి1,838 కు చేరుకోవడం సంస్థలను దిగ్భ్రాంతికి గురి చేసింది. విమాన నిర్వహణ ఖర్చుల్లో దాదాపు 30 శాతం వాటా కేవలం ఇంధనానిదే కావడం వల్ల, భారాన్ని విమానయాన సంస్థలు నేరుగా ప్రయాణికులపైనే వేస్తున్నాయి. టికెట్ బాదుడుఇంధన ధరల పెరుగుదల ప్రభావం టికెట్ ధరలపై స్పష్టంగా కనిపిస్తోంది. ముఖ్యంగా అమెరికా, యూరప్ దేశాల్లో విమాన ప్రయాణం సామాన్యులకు భారం అవుతోంది. అమెరికాలో దేశీయ విమాన ఛార్జీలు ఏడాది కాలంలోనే 18 శాతం పెరిగి సగటున వి358 కు చేరుకున్నాయి. విదేశీ ప్రయాణాల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. సగటు టికెట్ ధర సుమారు వి115 పెరిగి వి1,064 మార్కును దాటింది. అంటే విదేశాలకు వెళ్లాలనుకునే వారు ఇప్పుడు తమ బడ్జెట్‌ను భారీగా పెంచుకోవాల్సి వస్తోంది. విమానయాన సంస్థల వ్యూహాలుఖర్చులను తగ్గించుకోవడానికి అంతర్జాతీయ విమానయాన సంస్థలు కఠినమైన నిర్ణయాలు తీసుకుంటున్నాయి. జర్మనీకి చెందిన లుఫ్తానా దిగ్గజ సంస్థ ఈ వేసవిలో 20,000 స్వల్ప–దూర విమానాలను రద్దు చేయాలని నిర్ణయించింది. దీనివల్ల యూరప్ దేశాల మధ్య ప్రయాణించే వారికి ఎంపికలు తగ్గిపోయాయి. ఈ సంస్థ కూడా తన విమాన సర్వీసులను 5 శాతం మేర తగ్గించింది. టికెట్ ధరలు పెంచడమే కాకుండా, సామాను రుసుములను కూడా పెంచడం ద్వారా కంపెనీలు తమ నష్టాలను పూడ్చుకునే ప్రయత్నం చేస్తున్నాయి. ప్రస్తుతానికి కొన్ని విమానయాన సంస్థలు 'ఇంధన హెడ్జింగ్' ద్వారా స్వల్పకాలిక గండం నుంచి గట్టెక్కుతున్నాయి. కానీ యుద్ధం గనుక ఇలాగే కొనసాగితే ఈ వ్యూహాలు కూడా పని చేయవని నిపుణులు హెచ్చరిస్తున్నారు. విమాన టికెట్ల అధిక ధరల వల్ల ప్రజలు ముందస్తు బుకింగ్‌ల వైపు మొగ్గు చూపుతున్నారు. అలాగే ప్రయాణాల్లో విలాసాల కంటే 'బడ్జెట్–చేతన' నిర్ణయాలు తీసుకోవడం పెరిగింది. ప్రపంచ వాణిజ్యం, ప్రయాణ రంగాలు భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలకు ఎంతలా లోనవుతాయో ఈ పరిస్థితి మరోసారి నిరూపించింది. రాబోయే నెలల్లో విమాన ప్రయాణం మరింత ప్రియం కానుంది. ప్రయాణికులు తమ ప్రణాళికలను ముందుగానే సిద్ధం చేసుకోవడం, వీలైనంత వరకు 'ఫ్లెక్సిబుల్ బుకింగ్' ఆప్షన్లను ఎంచుకోవడం మంచిది. యుద్ధం ముగిసి చమురు ధరలు అదుపులోకి వచ్చే వరకు ఆకాశ ప్రయాణం సామాన్యుడికి అందనంత ఎత్తులోనే ఉండేలా కనిపిస్తోంది.

## ఆందోళన కలిగిస్తున్నా నౌకల దోపిడీలు, దారి మళ్లింపులు!

హొర్ముజ్, ఈ జలసంధి ద్వారా జరిగే రవాణాను అనిశ్చితికి గురిచేయగలిగేవి దాని భౌగోళిక స్వరూపం, దానిపై పట్టు కోసం పరితపించే దేశాలు. అత్యంత సన్నని ప్రదేశంలో సుమారు 33 కిలోమీటర్ల వెడల్పు మాత్రమే ఉండే ఈ మార్గంలో, నౌకాయానానికి అనుకూలమైన దారి ఒక్కో వైపు కేవలం మూడు కిలోమీటర్లకే పరిమితం. అందువల్ల, ఈ దారిలో సంచరించే నౌకలపై నిఘా పెట్టడం, వాటి ప్రయాణానికి అవాంతరాలు సృష్టించడం సాంకేతికంగా సులభం. ఈ జలసంధికి ఉత్తరతీరంలో ఉన్న ఇరాన్ ఆ భౌగోళిక సంక్లిష్టతను తన వ్యూహాత్మక ప్రయోజనాల కోసం నేర్పుగా వాడుకుంటున్నది. అమెరికాతో ఉద్రిక్తతలు పెరిగిన ప్రతిసారీ హొర్ముజ్‌ను మూసివేస్తామనే హెచ్చరికలు, సముద్రగర్భంలో మందుపాతరలు, నౌకల స్వాధీనం, అడపాదడపా డ్రోన్ దాడులు, టోల్ వసూలు ప్రతిపాదనలు వంటి చర్యలతో అంతర్జాతీయ విపణిలో అస్థిరతకు కారణమవుతున్నది. అంతేగాక, తమ ప్రధాన ఆదాయవనరు అయిన చమురు సరఫరా ఆగిపోతే -- ఖతార్, అరబ్ సంయుక్త రాష్ట్రాలు, బహ్రెయిన్, సౌదీ వంటి ఆర్థికవ్యవస్థలు తీవ్ర ఒడిదుడుకులకు లోనవుతాయి. సౌదీ, యూఏఈ దేశాలకు పైపులైన్ల వంటి ప్రత్యామ్నాయ మార్గాలున్నా, హొర్ముజ్ లోటును అవి పూడ్చలేవు. ఆసక్తికరంగా, ఈ మార్గాన్ని మూసివేస్తే అమెరికాకు నేరుగా కలిగే నష్టం పరిమితమే. కానీ ముడిచమురు సరఫరా వ్యవస్థలు గాడితప్పడం, ఇంధనధరల్లో హెచ్చుతగ్గులు, తనతో రక్షణ ఒప్పందాలు కలిగి ఉన్న గల్ఫ్ దేశాల్లో అమెరికా సామర్థ్యంపై అనుమానాలు వంటి పరిణామాల వల్ల అమెరికాకు జరిగే పరోక్ష, వ్యూహాత్మక నష్టం మాత్రం దీర్ఘకాలంలో తీవ్రంగా ఉంటుంది. హొర్ముజ్ ప్రాధాన్యతను సరిగ్గా అర్థం చేసుకోవాలంటే, ప్రపంచంలోని ఇతర కీలక జలసంధులను కూడా పరిశీలించాలి. మలక్కా జలసంధి ఆసియాలోని పలు పారిశ్రామిక దేశాలకు జీవనాడి. మధ్యప్రాచ్యం లోని చమురు దీని ద్వారా దక్షిణ చైనా సముద్రాన్ని చేరుకుని, అక్కడి నుంచి చైనా, జపాన్, దక్షిణ కొరియా వంటి పారిశ్రామిక దేశాలకు చేరుతుంది. అత్యంత రద్దీగా ఉండే ఈ మార్గంలో ఏ చిన్న అవాంతరం ఏర్పడినా ఈ దేశాల్లో ఉత్పత్తి కుంటుపడి ప్రపంచ సరఫరా వ్యవస్థలు ప్రభావితమవుతాయి. ఈ జలసంధిలో 1990, 2000 దశకాల్లో జరిగిన నౌకల దోపిడీలు, దారి మళ్లింపులు వంటివి ఇంకా ఆందోళన కలిగిస్తూనే ఉన్నాయి. అలాగే బాబ్ అల్ మాందెబ్ జలసంధి యూరప్–ఆసియా వాణిజ్యానికి కీలకమైన సముద్రద్వారం. దీని ద్వారా నౌకలు సూయజ్ కాలువలోకి ప్రవేశించి, అక్కడి నుంచి మధ్యధరా సముద్రం ద్వారా ఐరోపాలోని ఓడరేవులకు చేరుకునే వెసులుబాటు ఉండటంతో ఈ జలసంధి అత్యంత ప్రాముఖ్యతను సంతరించుకున్నది. ప్రముఖ చమురు ఉత్పత్తిదారు సౌదీ అరేబియా ఎగుమతుల్లో నాలుగో వంతు యాన్బు రేవు నుంచి ఈ జలసంధి ద్వారా ఎర్రసముద్రం చేరుకుంటుంది. యెమెన్‌లోని రాజకీయ అస్థిరతలు, ఇరాన్ ప్రాపకం కలిగిన హౌతీల హెచ్చరికలు ఈ మార్గంలో తరచూ ఉద్రిక్తతలు సృష్టిస్తున్నాయి. ఐరోపా విషయానికి వస్తే -- రష్యా, ఉక్రెయిన్, టర్కీ వంటి నల్లసముద్రం తీరదేశాలను మధ్యధరా సముద్రంతో కలిపే బోస్పోరస్, దార్దెనెల్లెస్ జలసంధులు చరిత్రకెక్కిన గల్లిపోలీ యుద్ధంతో పాటుగా అనేక వివాదాలకు కేంద్ర బిందువయ్యాయి. అదే విధంగా జిబ్రాల్టర్ జలసంధి అట్లాంటిక్ మహాసముద్రాన్ని మధ్యధరా సముద్రంతో కలుపుతూ, యూరప్–ఆఫ్రికాలను అనుసంధానిస్తున్నది. మిగిలిన జలసంధులతో పోల్చితే, ఇది వివాదాలకు, యుద్ధాలకు కొంత దూరంగానే ఉన్నప్పటికీ, సమీప దేశాలైన స్పెయిన్, ఇంగ్లాండ్ మధ్య ఆధిపత్యపోరుకు వేదికైంది. అన్ని కీలకమైన జలసంధులు కొన్ని సారూప్యతలను సూచిస్తున్నాయి. అవి సన్నని సముద్రమార్గాలు, వినియోగదేశాలు–ఉత్పత్తికేంద్రాల అనుసంధానం, నియంత్రణ కోసం వివాదాలు, ప్రపంచ వాణిజ్యంపై వాటి ప్రభావం. ప్రపంచం ఇరుపార్శ్వాలను దగ్గరకు చేర్చే సూయజ్ కాలువది మరోచరిత్ర. వాస్తవానికి ఇది సహజసిద్ధంగా ఏర్పడిన జలసంధి కాదు, మానవనిర్మిత కాలువ. మధ్యధరా సముద్రాన్ని ఎర్ర సముద్రంతో కలిపి, ఐరోపాను ఆసియాతో నేరుగా అనుసంధానిస్తుంది. దీంతో ఈ కాలువ ప్రపంచ వాణిజ్యానికి అత్యంత కీలకంగా మారింది. ఒకప్పుడు ఈ కాలువ బ్రిటిష్ సామ్రాజ్య ప్రాబల్యానికి ప్రతీకగా నిలిచింది. కానీ ఈజిప్ట్‌పై బ్రిటన్, దాని మిత్రదేశాలు జరిపిన దాడి అనంతరం సూయజ్‌పై బ్రిటన్ పట్టు సడలింది. అప్పటివరకు తిరుగులేని ఆధిపత్యం చెలా యించిన పౌండ్ స్టెర్లింగ్ విదేశీమారకద్రవ్యంగా తన ప్రాభవాన్ని క్రమంగా కోల్పోవడం యాదృచ్ఛికం కాదు. అంతర్జాతీయ ఆర్థిక, వాణిజ్య రంగాల్లో బ్రిటన్ ప్రభావం బలహీనపడటానికి పౌండ్ క్షీణత కూడా ముఖ్య కారణాలల్లో ఒకటిగా నిలిచింది. పునరావృతం కావడం చరిత్ర లక్షణం. ప్రస్తుతం పాత్రధారులు మారారు కానీ, పాత్రలు కాదు. సూయజ్ స్థానంలో హొర్ముజ్, బ్రిటన్ స్థానంలో అమెరికా, పౌండ్ స్థానంలో పెట్రోడాలర్, ఈజిప్ట్ స్థానంలో ఇరాన్ చేరాయి. ప్రస్తుతం హొర్ముజ్ కేంద్రంగా ఇరాన్ -- అమెరికా మధ్య ప్రపంచాన్ని విస్తుగొలిపే దోబూచులాట జరుగుతున్నది. అమెరికా హెచ్చరికలు -- అంతలోనే బుజ్జగింపులు, కాల్పుల విరమణ ఒప్పందం -- వెనువెంటనే అతిక్రమణ, మందుపాతరలు అమర్చటం -- తొలగించటం, అమెరికా–ఇరాన్ పోటాపోటీ అడ్డగింతలు. ఈ చదరంగంలో ఒకవేళ ఇరాన్ పైచేయి సాధిస్తే -- దాని ప్రభావం కేవలం చమురు సరఫరాపైనే కాదు; అది పెట్రోడాలర్ వ్యవస్థపై కూడా పడుతుంది. అంతర్జాతీయ చమురు వాణిజ్యం అత్యధిక శాతం డాలర్ల లోనే జరగడం, అమెరికా తిరుగులేని ఆర్థిక ఆధిపత్యానికి ఒక ప్రధాన కారణం. ఆ దేశం సైనికపాటవం, రవాణామార్గాలపై ఆధిపత్యం, సంప్రదిం పుల్లో చాకచక్యం, ఇరాన్ వంటి దేశాలను తన దారికి తెచ్చుకోగలగటం వంటి అంశాలపై ప్రపంచదేశాల్లో సందేహాలు ఏర్పడితే -- రష్యా, చైనా, బ్రిక్స్ వంటి దేశాలు, కూటములు డాలర్‌కు తగిన ప్రత్యామ్నాయాలతో సిద్ధంగా ఉన్నాయి. ఇరాన్ నుంచి దిగుమతి చేసుకున్న చమురుకు కొంతకాలంపాటు మన మారకంలో చెల్లించి, పరిస్థితులు అనుకూలిస్తే రూపాయి కూడా పెట్రో డాలర్ స్థానాన్ని పరిమితంగానైన భర్తీ చేయగలదనే సంకేతాన్ని భారత్ ఎప్పుడో ఇచ్చింది. ఇరాన్‌కు కావలసింది కూడా అదే. దానికి నాందిగానేమో -- జలసంధి ద్వారా వెళ్లే చమురు నౌకలకు చైనా వినిమయం యువాన్‌లలో టోల్‌ను పోలిన రుసుము వసూలు చేయడం ప్రారంభించిందనే వార్తలు వస్తున్నాయి. ఈ పరిణామాలు ఇప్పటికిప్పుడు డాలర్ ప్రాముఖ్యతను తగ్గించలేకపోయినప్పటికీ, ఆ దిశగా అడుగులు పడవచ్చని విశ్లేషకుల అంచనా. అది ఏ స్థాయిలో జరుగుతుందన్నది చరిత్ర నిర్ణయిస్తుంది. ప్రధాన పాత్రధారులైన అమెరికా– ఇరాన్‌ను పక్కన పెడితే, భారత్ లాంటి చమురు దిగుమతుల ఆధారిత దేశాలకు పటిష్ఠమైన దౌత్య సంబంధాలు, పునరుత్పాదక ఇంధన వనరులు, వ్యూహాత్మక నిల్వలు, సరఫరాదారుల జాబితా విస్తరణ అనేవి హొర్ముజ్ వంటి జలసంధులు నేర్పే గుణపాఠాలు.

## కస్టమర్ దెబ్బకు దిగొచ్చిన బ్యాంక్..

న్యూఢిల్లీ: క్రెడిట్ కార్డు క్లోజ్ చేయడంలో బ్యాంక్ చేసిన నిర్లక్ష్యం ఓ కస్టమర్‌కు లాభాన్ని తెచ్చిపెట్టింది. కస్టమర్ ఇచ్చిన చిన్న కంప్లయింట్‌తో దిగొచ్చిన బ్యాంక్ .. చివరకు రూ.3.21 లక్షల పరిహారం చెల్లించి సెటిల్‌మెంట్ చేసుకోవాల్సి వచ్చింది. ఈ ఘటన ఇప్పుడు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. ఓ వ్యక్తికి కోటక్ మహీంద్రా బ్యాంకు నుంచి రెండు క్రెడిట్ కార్డులు ఉన్నాయి. గత ఏడాది మేలో అతని క్రెడిట్ కార్డు లిమిట్‌ను ఉన్నఫళంగా రూ.లక్ష నుంచి రూ.10వేలకు బ్యాంకు తగ్గించేసింది. లిమిట్ తగ్గించేయడంతో తన రెండు క్రెడిట్ కార్డులను క్లోజ్ చేయాలని కస్టమర్ భావించాడు. వెంటనే బ్యాంక్‌కు మెయిల్ ద్వారా రిక్వెస్ట్ పెట్టాడు. కానీ బ్యాంక్ మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోలేదు. బ్యాంక్ నుంచి రెస్పాన్స్ లేకపోవడంతో పలుమార్లు రిమైండర్ మెయిల్స్ కూడా పంపించాడు. అయినప్పటికీ బ్యాంకుల నుంచి ఎలాంటి స్పందన రాలేదు. అలా దాదాపు ఏడాది గడిచిపోయింది. ఈ ఏడాది ఏప్రిల్ మొదటి వారంలో అకౌంట్‌ను పరిశీలించగా.. క్రెడిట్ కార్డు మెయింటెనెన్స్ వార్షిక చార్జిల కింద రూ.1180 కట్ చేసినట్లు కస్టమర్ గుర్తించాడు. దీనిపై బ్యాంక్‌ను స్పందించగా.. మీ కార్డులు ఇంకా క్లోజ్ కాలేదని సమాధానమిచ్చారు. బిల్లు కట్టాలని సూచించారు. బ్యాంక్ నుంచి వచ్చిన సమాధానంతో అసంతృప్తి చెందిన సదరు కస్టమర్ చివరకు బ్యాంకింగ్ అంబుడ్స్‌మెంట్‌లో ఫిర్యాదు చేశాడు. అప్పుడు బ్యాంక్ నోడల్ అధికారి కస్టమర్‌ను సంప్రదించాడు. ఈ మెయిల్ ద్వారా చేసే క్లోజర్ రిక్వెస్ట్‌లు అంగీకరించబోమని పేర్కొన్నారు. అయితే తాను రాతపూర్వకంగా కూడా బ్యాంకులో లెటర్ ఇచ్చానని కస్టమర్ స్పష్టం చేశాడు. ఈ ప్రక్రియ ఇలా కొనసాగుతుండగానే.. కస్టమర్ ఖాతాలో రూ.3,21,000 పరిహారం జమ అయినట్లు మెసేజ్ రావడం గుర్తించారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మార్గదర్శకాల ప్రకారం.. క్రెడిట్ కార్డు క్లోజ్ చేయడంలో ఆలస్యం జరిగితే రోజుకు రూ.500 చొప్పున పరిహారం చెల్లించాల్సి ఉంటుంది. ఈ కేసులో రెండు కార్డులపై 321 రోజులు ఆలస్యమైంది. దీంతో రెండు కార్డులపై రోజుకు వెయ్యి రూపాయల చొప్పున మొత్తం రూ.3.21లక్షలు చెల్లించబడినట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని సదరు కస్టమర్ రెడిట్ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ద్వారా పంచుకున్నాడు. ఇది కాస్త వైరల్‌గా మారింది. దీనిపై నెటిజన్లు స్పందిస్తూ.. సరైన మార్గంలో ఫిర్యాదు చేస్తే న్యాయం సాధ్యమేనని కామెంట్ చేస్తున్నారు.

## ప్రత్యామ్నాయ పంటలపై రైతులు దృష్టిసారించాలి..




సూర్యాపేట, : రైతులు వరికి బదులుగా ప్రత్యామ్నా య పంటలపై దృష్టి సారించాలని ఏఐసీసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అన్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని స్టార్ బంకెట్ హాల్ లో ఉద్యానవన ,పట్టు పరిశ్రమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఆయిల్ ఫామ్ సాగుపై రైతులకు అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొనీ మాట్లాడారు. వరి పండించడానికి ఒక కిలో ధాన్యానికి 2000 నుంచి 3000 లీటర్ల నీళ్లు అవసరమని అంతేకాకుండా ప్రతిసారి వరి పండించడం వలన భూసారం కోల్పోతుందన్నారు. దీంతో ఖర్చులు పెరిగి దిగబడి తగ్గిపోతుందన్నారు. వరికి ప్రత్యామ్నాయంగా ఆయిల్ ఫామ్ సాగులవల్ల దీర్ఘకాలిక ప్రయోజనాలు ఉంటాయన్నారు. కూరగాయల సాగు కూడా చాలా ఉపయోగకరంగా ఉంటుందన్నారు. రైతులు శాస్త్రీయ దృక్పథంతో ఆలోచించి శాస్త్రవేత్తల సలహాలు తీసుకొని ఆధునిక వ్యవసాయ పద్ధతులతో ఆయిల్ ఫామ్ కూరగాయల సాగు, వాణిజ్య పంటల వైపు మొగ్గు చూపాలన్నారు. రైతులకు వ్యవసాయ శాస్త్రవేత్తలు తగిన రీతిలో అవగాహన కల్పించాలని, మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలని, అంతేకాకుండా గిట్టుబాటు ధరలు కూడా వచ్చే విధంగా చేయాలన్నారు. రైతులు పాడి పరిశ్రమపై దృష్టి సారించాలని, 2012 నుండి తన తండ్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి సూచనల మేరకు, తన తల్లి పేరుమీద హయత్ నగర్ లో డైరీ నడిపిస్తున్నానన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రైతులకు సబ్సిడీతో యంత్రాలు అందిస్తుందని కాబట్టి రైతులు డ్రిప్ ఇరిగేషన్ వైపు మొగ్గు చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మ చైర్మన్ కాసం లింగారెడ్డి , వైస్ చైర్మన్ పంతంగి మల్సూరు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కోతి గోపాల్ రెడ్డి, తూముల సురేష్ రావు, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్ రెడ్డి, హార్టికల్చర్ అధికారి నాగయ్య, ఆయిల్ ఫిడ్ ఇన్చార్జి అలీం, కె వి కే సీనియర్ సైంటిస్ట్ నరేష్, ఇఫ్కో మేనేజర్ వెంకటేష్, జెకే పేపర్స్ మేనేజర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# టొవినో డ్రాపయ్యాడు... డ్రాగన్ నో అన్నాడు




జూనియర్ ఎన్టీఆర్, దర్శకుడు ప్రశాంత్ నీల్ కలయికలో తెరకెక్కుతున్న ప్యాన్ ఇండియా మూవీలో టొవినో థామస్ ఒక ముఖ్యమైన పాత్ర చేస్తున్న సంగతి తెలిసిందే. కొన్ని వారాల క్రితం దీని కోసం కఠినమైన శిక్షణ తీసుకుంటున్న వీడియోని అతను సోషల్ మీడియాలో షేర్ చేశాడు. నెగటివ్ షేడ్స్ ఉన్నప్పటికీ చాలా పవర్ ఫుల్ గా ఉంటుందని, పుష్పలో ఫహద్ ఫాసిల్ కు పదింతల ఇంటెన్సిటీ ఉండేలా డిజైన్ చేశారనే ప్రచారం మల్లువుడ్ మీడియాలో తిరిగింది. తీరా చూస్తే టొవినో థామస్ ఈ ప్రాజెక్టు నుంచి తప్పుకున్నాడు. ఏప్రిల్ 10 విడుదల కాబోతున్న పళ్ళిచట్టంబి ప్రమోషన్లలో భాగంగా హైదరాబాద్ వచ్చిన అతను ప్రెస్ మీట్ లో మాట్లాడుతూ తారక్ అభిమానులకు షాకింగ్ న్యూస్ చెప్పాడు. వేరే కమిట్ మెంట్స్ వల్ల నీల్ సినిమాకు డేట్స్ కేటాయించడం కష్టంగా ఉందని అందుకే వదులుకున్నట్టు కుండ బద్దలు కొట్టేశాడు. అయితే తన స్థానంలో ఎవరు వస్తున్నారనేది మాత్రం ప్రస్తుతానికి సస్పెన్స్ గానే ఉండనుంది. దీనికి టొవినో సహేతుకమైన కారణాలు వివరించాడు. మలయాళంలో తక్కువ రోజుల్లో సింగల్ షెడ్యూల్ లో సినిమా తీస్తారు కాబట్టి ఒకదాని తర్వాత మరొకటి వేగంగా చేయగలుగుతున్నామని, కానీ తెలుగుకు వచ్చేటప్పటికీ ఎక్కువ డేట్లు ఇవ్వడంతో పాటు ఏడాది దాకా వేచి చూడాల్సి వస్తోంది కాబట్టే టాలీవుడ్ స్ట్రెయిట్ మూవీస్ కి దూరంగా ఉండాల్సి వస్తోందని క్లారిటీ ఇచ్చాడు. ఎన్టీఆర్ నీల్ ప్రాజెక్టు వదులుకోవడం వ్యక్తిగతంగా తనకు లాసే అని చెప్పాలి. ఇది కాసేపు పక్కనపెడితే క్వాలిటీ, ఇతరత్రా కారణాల పేరుతో మన దర్శకులు ఎంత జాప్యం చేస్తున్నారో దీన్ని బట్టి అర్థం చేసుకోవచ్చు. విఎఫెక్స్ డిమాండ్ చేసే కంటెంట్ అయినా, గ్రాఫిక్స్ అవసరం లేని ఎంటర్ టైనర్ అయినా ఏడాదిలోపు పూర్తి చేయడం కలలా మారిపోయింది. దీనికి తోడు రిలీజ్ డేట్ల వాయిదాలు బోనస్. ఒక్క అనిల్ రావిపూడి మాత్రమే దీనికి మినహాయింపుగా చెప్పొచ్చు. మరి టొవినో అన్నట్టు మనోళ్లు కూడా స్పీడ్ పెంచితే ఎక్కువ సినిమాలు వస్తాయి.

# బాలయ్య లిస్టులో ఫస్టు ఎవరు నెక్స్ట్ ఎవరు



ప్రస్తుతం గోపీచంద్ మలినేని దర్శకత్వంలో యాక్షన్ ఎంటర్ టైనర్ చేస్తున్న బాలకృష్ణ తర్వాత ఎవరితో చేస్తారనే దాని మీద రకరకాల టాక్స్ ఉన్నాయి. మైత్రి మూవీ మేకర్స్ నిర్మాణంలో దర్శకుడు వివేక్ ఆత్రేయ ప్రాజెక్టు దాదాపు ఓకే అయినట్టే. కాకపోతే అఫీషియల్ అనౌన్స్ మెంట్ ఇంకా రాలేదు. వీరసింహారెడ్డి నిర్మాణ సంస్థ కావడంతో బాలయ్య ముందు నుంచి ఈ ప్రతిపాదన మీద సానుకూలంగా ఉన్నారు. స్టోరీ సరికొత్త లైన్ తో చాలా డిఫరెంట్ గా వచ్చిందని వినికిడి. అల్లరి నరేష్ నాందితో పేరు తెచ్చుకున్న విజయ్ కనకమేడల చెప్పిన కథ ఒకటి బాలయ్యకు నచ్చిందట. సుధాకర్ చెరుకూరి ప్రొడ్యూస్ చేసేందుకు సిద్ధంగా ఉన్నట్టు సమాచారం. బడ్జెట్ పరంగా ఇదే వేగంగా పూర్తయ్యే ఛాన్స్ ఉండటంతో ఏదో ఫస్ట్ ఏది నెక్స్ట్ అనే దాని మీద బాలకృష్ణ ఇంకా నిర్ణయం తీసుకోలేదని సమాచారం. ప్రస్తుతం మలినేని షూటింగ్ లో బిజీగా ఉండటంతో కొంచెం టైం తీసుకుని నిర్ణయం చెబుతానని అన్నారట. అప్పటిదాకా వెయిట్ చేయాలి. ఇక హరీష్ శంకర్ కూడా ఈ జాబితాలో ఉన్నట్టు మరో టాక్ ఉంది. ఉస్తాద్ భగత్ సింగ్ ఆశించిన ఫలితం ఇవ్వలేకపోవడంతో ఈసారి ఎవరితో చేస్తారనే దాని మీద ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. దీనికన్నా ముందు హరీష్ శంకర్ పలుమార్లు రామ్ ని ట్రై చేసినట్టు ప్రచారం జరిగింది. కథ విషయంలో ఏకాభిప్రాయం రాకపోవడంతో అది ప్రపోజల్ స్టేజి దాటి ముందుకు వెళ్ళలేదు. సో బాలయ్యతో మూవీ ఉంటుందా లేదానేది ఇంకొద్ది రోజులు ఆగితే తెలుస్తుంది. అఖండ 2 ఫెయిల్యూర్ తర్వాత బాలకృష్ణ మరింత జాగ్రత్తగా ఉంటున్నారు. మలినేని ముందు రాసుకున్న హిస్టారికల్ సబ్జెక్టు పక్కనపెట్టి కమర్షియల్ మూవీ వైపు షిఫ్ట్ అయిపోయారు. హీరోయిన్ నయనతార కాగా రెండో కథానాయికగా డింపుల్ హయతి దాదాపు ఫిక్స్ అయ్యింది. వీలైతే ఈ ఏడాది దసరా లేదా దీపావళి విడుదలకు టార్గెట్ చేస్తున్నారు. మిస్ అయితే మాత్రం 2027 సంక్రాంతి తప్ప వేరే ఆప్షన్ ఉండదు. ఇప్పటికైతే విడుదల గురించి ఏ ఆలోచనా చేయడం లేదట.

# ఖమ్మం జిలాల్లో వరుస దొంగతనాలు

ఖమ్మం : కారేపల్లి మండల కేంద్రంలో చోటుచేసుకుంటున్న వరుస దొంగతనాలతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. కష్టపడి సంపాదించిన సొమ్ము, డబ్బులు రాత్రికి రాత్రే దొంగలు మాయం చేస్తారేమోనని భయంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో వేల రూపాయలు ఖర్చు చేసి మండల కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయగా ప్రస్తుతం వాటి పనితీరు సవ్యంగా లేదు. దీంతో దొంగలకు దొంగతనం చేసేందుకు సులువుగా మారింది. ఇటీవల కారేపల్లి పోస్ట్ ఆఫీస్ లోకి దొంగలు చొరబడి దోపిడీకి యత్నించారు. అయితే వారి ప్రయత్నం ఫలించలేదు. కార్యాలయంలోని క్యాష్ చెస్ట్(లాకర్) తెరవాలని చూడగా ఓపెన్ కాకపోవడంతో వెనుతిరిగి పోయారు. శివాలయం సమీపంలో గల ఓ ఇంటి లోకి తాళం పగులగొట్టి చొరబడ్డారు. ఇంట్లో విలువైన ఆభరణాలు, నగదు లేకపోవడంతో బీరువాలోని బట్టలు చిందరవందగా పడేసి పూజ గదిలోని వెండి పూజా సామగ్రిని తీసుకు వెళ్లారు. అలాగే సింగరేణి గ్రామ పంచాయతీ కార్యాలయం సమీపంలో గల ఓ ఇంట్లోకి చొరబడగా ఏమీ దొరకకపోవడంతో ఇంట్లో నిల్వ ఉన్న ఆహార పదార్థాలు తిని వెళ్లారు. కాగా కారేపల్లి పోలీసుల అదుపులో ఓ దొంగ ఉన్నట్లు సమాచారం. మండల కేంద్రంలో దొంగతనాలకు పాల్పడిన ఆ వ్యక్తి రైలు ఎక్కి పారిపోతుండగా ఖమ్మం సిసిఎస్ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. ఖమ్మం సిసిఎస్ పోలీసుల విచారణలో ఆ వ్యక్తి కారేపల్లిలో పలుచోట్ల దొంగతనాలకు పాల్పడినట్లు ఒప్పుకోవడంతో స్థానిక పోలీసులకు అప్పగించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# ఆ దేశం వెళ్లేందుకు భయపడతారు..


ఆఫ్రికా, ఆఫ్రికాలోని ఒక చిన్న దేశం గురించి తెలిస్తే.. ఒళ్లు చెమటలు పట్టాల్సిందే. యూట్యూబ్.. సోషల్ మీడియా పుణ్యమా ప్రపంచంలోని ఏ మూలన ఉన్న దేశానికైనా టూరిస్టుగా వెళ్లటం.. అక్కడి అందాల్ని.. ఆ దేశ ప్రత్యేకతల్ని చెప్పే వారి సంఖ్య పెరిగింది. దీని పుణ్యమా అని వివిధ దేశాల్ని పర్యటించే అభిలాష ఉండే వారు.. ఎక్కువగా ప్రయాణాలు చేస్తున్న పరిస్థితి. అయితే.. ఆఫ్రికా ఖండంలోని అతి చిన్న దేశం గురించి తెలిస్తే మాత్రం వెన్నులో వణుకు పుట్టాల్సిందే. ఈ దేశం గురించి తెలిస్తే.. ఆ దేశం దరిదాపుల్లోకి వెళ్లేందుకు సైతం భయపడతారు. ఎందుకంటే.. ఆ దేశంలోని 15 ఏళ్ల నుంచి 49 ఏళ్ల వయసులో ఉన్న ప్రతి నలుగురిలో ఒకరికి హెచ్ ఐవీ పాజిటివ్ ఉండటమే దీనికి కారణం. ఇంతకూ ఆ దేశం పేరేమంటే.. అక్కడికే వస్తున్నాం. 'ఎస్వతిని'. కొన్నేళ్ల క్రితం వరకు స్వాజిలాండ్ గా పిలిచిన ఆ దేశం తన పేరును 'ఎస్వతిని'గా మార్చుకుంది. ఈ దేశం మొత్తం జనాభా 12 లక్షలు మాత్రమే కానీ.. వీరిలో మూడు లక్షల మంది హెచ్ ఐవీ పాజిటివ్ అయిన వారే ఉండటం గమనార్హం. ప్రతి ఏడాది దాదాపు 7 వేల మంది హెచ్ఐవీ బారిన పడుతున్నట్లుగా చెబుతారు. మరో షాకింగ్ నిజం ఏమంటే.. హెచ్ఐవీ బారిన పడిన వారిలో పురుషుల కంటే.. మహిళలే ఎక్కువగా ఉంటారు. యువత ఎక్కువగా హెచ్ ఐవీ బారిన పడుతున్న దేశాల్లో ఎస్వతిని ప్రపంచంలోనే మొదటి స్థానంలో ఉండటం గమనార్హం. చిన్న దేశమే కాదు.. నిరుపేద దేశం కూడా. జనాభాలో 60 శాతం మంది దారిద్ర్యరేఖకు దిగువన నివసిస్తుంటారు. పేదరికంతో కొట్టుమిట్టాడే ఈ దేశస్తులు.. తమ పొరుగున ఉన్న దక్షిణాఫ్రికా గనుల్లో కూలీ పనుల కోసం వెళతారు. ఎస్వతిని సంప్రదాయ న్రత్యం రీడ్ డ్యాన్స్. దీనిని చూసేందుకు ప్రపంచం నలుమూలల నుంచి పర్యాటకులు వస్తుంటారు. అయితే.. చాలామంది చెప్పే మాట ఏమంటే.. విదేశీయుల వద్దకు నిరుపేద మహిళలు డబ్బుల కోసం సెక్సు చేస్తుంటారన్నది ఆ దేశాన్ని.. ఆ దేశ ప్రజల్ని తక్కువ చేసి చూపించటమే అవుతుంది. ఎందుకంటే.. నిరుపేద దేశమే అయినా.. ఇక్కడి ప్రజల సంప్రదాయవాదులు. ఆ దేశంలోని సంప్రదాయమే ఈ దరిద్రపు గొట్టు పరిస్థితికి కారణంగా చెబుతారు. ఈ దేశ మగవారు తమ మగతనానికి నిదర్శనంగా ఎక్కువ మంది భార్యల్ని కలిగి ఉంటారు. ఎక్కువమంది మహిళలతో సెక్సు చేయటం గొప్పగా భావిస్తారు. ఈ తీరే.. హెచ్ఐవీ భారీ పెరుగుదలకు కారణం. చిన్న వయసులో ఉన్న అమ్మాయిలు.. తమ కంటే వయసులో పెద్దవారైన పురుషులతో లైంగిక సంబంధాలు కలిగి ఉండటం.. సురక్షిత పద్దతుల్నిపాటించకపోవటం.. అమ్మాయిలతో ఎక్కువగా కలిసే పురుషుల కారణంగా హెచ్ ఐవీ అంతకంతకూ పెరిగి.. ఈ రోజు తీవ్రస్థాయికి చేరుకుంది. 1986లో హెచ్ఐవీ కేసు ఈ దేశంలో వెలుగు చూసింది. అయితే.. ప్రజల్లో అవగాహన తక్కువగా ఉండటం.. ప్రభుత్వం పెద్దగా పట్టిం చుకోని కారణంగా సమస్య తీవ్రత పెరిగింది. ఇప్పుడు పరిస్థితుల్లో మార్పు వస్తోంది. ఇదంతా చూసినప్పుడు ఈ దేశం ఏ మాత్రం సేఫ్ కాదన్న భావన కలగొచ్చు. కానీ.. అందులో నిజం లేదని చెబుతారు, ఎ్నందకంటే.. ఈ దేశం విదేశీ పర్యాటకులతో అత్యంత స్నేహపూర్వకంగా ఉంటారు. అలా అని వారిని తప్పు కోణంలో చూడటం సరికాదంటారు. పర్యాటకుల్ని తమ కుటుంబ సభ్యులుగా భావించి.. సాదరంగా ఆహ్వానిస్తారు. అలా అని సెక్సు కోసం అని భావిస్తే తప్పులో కాలేసినట్లే. విదేశీయులకు తమ ఆచారాల గురించి వివరించేందుకు వారెంతో ఇష్టపడతారు. ఈ దేశంలో పర్యటించటం ద్వారా ఆఫ్రికా కల్చర్.. ప్రకృతిని అతి తక్కువ సమయంలో ఎంజాయ్ చేసే అనుభవం సొంతం అవుతుంది. ఈ దేశానికి వెళ్లే విదేశీయులకు ఎలాంటి ప్రమాదం ఉండదు. కొందరు మహిళలు డబ్బుల కోసం సురక్షితం కాని సెక్సులో పాల్గొంటారు. అది కూడా స్థానికులతోనే. దీనికి తోడు ఆ దేశంలోని పురుషులు కండోమ్స్ వాడేందుకు ఇష్టపడరు. దీనికి తోడు మహిళలకు సురక్షిత శృంగారం గురించి నిర్ణయం తీసుకునే అధికారం తక్కువగా ఉండటంతో వారు హెచ్ఐవీ బారిన పడుతుంటారు.

# మే 2వ వరకు రైతు వేదికలో ప్రత్యేక డ్రైవ్

హైద్రాబాద్: మొయినాబాద్ మండలంలోని ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ గౌతమ్ కుమార్ సూచించారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో వ్యవసాయ విస్తీర్ణ అధికారులు, మీసేవ కేంద్రాల మేనేజర్లు, గ్రామ పరిపాలన అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ గౌతమ్ కుమార్ మాట్లాడుతూ.. ఆధార్ ద్వారా దేశంలోని ప్రతి పౌరునికి గుర్తింపు కల్పించినట్లుగానే ప్రతి రైతుకు 14 అంకెల విశిష్ట గుర్తింపు సంఖ్య కేటాయించే కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. వ్యవసాయ రంగాన్ని పూర్తిగా డిజిటలైజేషన్ చెయ్యాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్టు తెలిపారు. భూమి కలిగిన ప్రతి రైతుకు సంబంధించిన భూ యజమాన్య వివరాలు వ్యక్తిగత సమాచారం ఆధారంగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ రూపొందించబడుతుందని, ఆయన చెప్పారు. పీఎం కిసాన్ పథకం తదుపరి విడుదల లబ్ధి పొందాలంటే ఫార్మర్ రిజిస్ట్రేషన్లో తప్పనిసరిగా నమోదు ఉండాలని కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసిందన్నారు. రాబోయే వర్షాకాలం సీజన్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ పథకాలు అయిన రైతు భరోసా, రుణమాఫీ, మొక్కజొన్న, పత్తి, ధాన్యం కొనుగోలు ఇతర ఎరువుల పంపిణీకి ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి అవుతుందని అన్నారు. మే 2వ తేదీ వరకు మండలంలోని రైతు వేదికలో ప్రత్యేక డ్రైవ్ ఉంటుందని, రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో దండెం విజయ చంద్ర, ఏఈవోలు సునీల్ కుమార్, ఏ.కుమార్, వరుణ్ కుమార్, గ్రామ పరిపాలన అధికారులు, మీసేవ కేంద్రాల మేనేజర్లు, తదితరులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ కేసుల్లో శిక్ష పడేలా దర్యాప్తు జరపాలి..

## జీటీ న్యాబ్ డైరెక్టర్ సందీప్ శాండిల్య



హైద్రాబాద్: గంజాయి, డ్రగ్స్, నారోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్ స్టెన్సెస్ నిర్మూలన ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతగా గుర్తించాలని టీజీ న్యాబ్ డైరెక్టర్ సందీప్ శ్యాండిల్య అన్నారు. ఉద్యోగులుగా చట్టం పరిధిలోనే పనిచేస్తూ కేసుల దర్యాప్తులో పారదర్శకతతో పాటు నేరస్తులకు శిక్ష పడేలా సమగ్ర దర్యాప్తు జరపాలని శిక్షణ పొందుతున్న ఎక్సైజ్ అధికారులకు సూచించారు. 'నారోటిక్ డ్రగ్స్ చట్టాలపై, కేసులు ఎలా రాయాలి?' అనే అంశాలపై ఎక్సైజ్ ఆకాడమీలో నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో టీజీ న్యాబ్ డైరెక్టర్ సందీప్ శాండిల్య ఎక్సైజ్ అధికారులకు సూచించారు. గంజాయి, డ్రగ్స్‌ను పట్టుకున్నప్పుడు ప్రాథమికంగా అవలంభించాల్సిన పద్ధతులను, పంచామా, జీడీ ఎంట్రీ, ఉన్నతాధికారుల నుంచి తీసుకోవాల్సిన అనుమతులను, ఎఫ్ఆర్ఐలో పొందుపర్చాల్సిన సమాచారం, కేసు నమోదు, చార్జ్‌షీట్, పంచుల ఎంపిక తదితర కీలక అంశాలలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఉదాహరణలతో వివరించారు. నేరాలకు పాల్పడిన వారిలో శిక్షలు పడుతున్నాయనే భయం ఏర్పడితే నిషేధిత డ్రగ్స్, గంజాయి రవాణా, అమ్మకాలు, వినియోగం తగ్గు ముఖం పడుతాయని డైరెక్టర్ సందీప్ శాండిల్య వివరించారు. ఈ సందర్భంగా టీజీ న్యాబ్ ఆధ్వర్యంలో చట్టాలపై ముద్రించిన పుస్తకాలను శిక్షణ పొందుతున్న ఎక్సైజ్ సిబ్బందికి ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో 31 మంది ఎక్సైజ్ ఏఈఎస్‌లు, 84మంది ఎస్ఐలతో పాటు ఆకాడమీ డైరెక్టర్ సురేష్ రాథోడ్, జాయింట్ డైరెక్టర్ శశిధర్‌రెడ్డి, ఈఎస్ నంద్యాల అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పెట్రోల్ బంకుల వద్ద వాహనాల బారులు..

హైద్రాబాద్: ఏపీలో డీజిల్ కొరత ప్రభావం తెలంగాణపై పడుతోంది. తెలంగాణ సరిహద్దు ప్రాంతాలలోని పెట్రోల్ బంకుల వద్ద రద్దీ పెరుగుతోంది. వాహనదారులు, రైతులు డీజిల్ కోసం తెలంగాణ సరిహద్దులలోని పెట్రోల్ బంకుల వద్ద క్యూ కడుతున్నారు. దీంతో వాహనాలు బారులు తీరుతున్నాయి. మరోవైపు ఏపీలో పూర్తిస్థాయిలో ఇంధన సరఫరా జరిగే వరకూ ఇదే పరిస్థితి ఉండే అవకాశం ఉందని పెట్రోల్ బంకుల నిర్వాహకులు చెప్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో డీజిల్ కొరత ప్రభావం తెలంగాణపై పడుతోంది. ఏపీలోని పలు జిల్లాలలో ఉన్న పెట్రోల్ బంకులలో డీజిల్ నిల్వలు నిండుకున్నాయి. దీంతో డీజిల్ కొరత తలెత్తగా.. వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇదే సమయంలో డీజిల్ కోసం తెలంగాణ సరిహద్దు ప్రాంతాలకు క్యూ కడుతున్నారు. ఫలితంగా తెలంగాణ, ఏపీ సరిహద్దు ప్రాంతాలలో ఉన్న పెట్రోల్ బంకుల వద్ద వాహనాలు బారులు తీరుతున్నాయి. ముఖ్యంగా జోగులాంబ గద్వాల జిల్లాలోని ఉండవెల్లి, మానవపాడు మండలాల్లో ఉన్న పెట్రోల్ బంకుల వద్ద ఈ తరహా వాతావరణం కనిపిస్తోంది. ఆంధ్రప్రదేశ్ నుంచి లారీలు, కార్లు, ఆటోలతో పాటుగా సేద్యపు పనులలో ఉపయోగించే వాహనాలతో పెట్రోల్ బంకుల వద్ద క్యూ కడుతున్నారు. కొంతమంది రైతులు కూడా డబ్బాలతో డీజిల్ కోసం వస్తున్న పరిస్థితి. మరోవైపు ఏపీలో పెట్రోల్ బంకుల వద్ద డీజిల్ నోస్టాక్ బోర్డులు కనిపిస్తున్నాయని.. మరికొన్ని చోట్ల పరిమితంగా ఇస్తున్నారని వాహనదారులు, రైతులు చెప్తున్నారు. దీంతో తెలంగాణ సరిహద్దులకు వచ్చి డీజిల్ తీసుకోవాల్సి వస్తోందంటున్నారు. అయితే పెట్రోల్ బంకుల సిబ్బంది డబ్బాలలో డీజిల్ పోయటం లేదంటూ రైతులు వాపోతున్నారు. సేద్యపు పనులలో భాగంగా పలు యంత్రాలకు డీజిల్ అవసరం ఉంటుంది. దీంతో రైతులు కూడా డీజిల్ కోసం క్యూ కడుతున్నారు. మరోవైపు ఆంధ్రప్రదేశ్‌లో ఇంధన సరఫరా పూర్తిస్థాయిలో పునరుద్ధరించే వరకూ ఇదే పరిస్థితి కొనసాగే అవకాశం ఉందని తెలంగాణ సరిహద్దుల్లోని పెట్రోల్ బంకుల నిర్వాహకులు అభిప్రాయపడుతున్నారు. మరికొంతమంది ముందు జాగ్రత్తగా స్టాక్‌ను పెంచుకునే పనిలో ఉన్నారు. మరోవైపు ఆయిల్ కంపెనీలు పెట్రోల్ బంకులకు ఇంధన సరఫరాను తగ్గించటంతో ఏపీలో పలుచోట్ల డీజిల్ కొరత ఏర్పడింది. ఆయిల్ కంపెనీలు పెట్రోల్ బంకులకు క్రెడిట్ సౌకర్యాన్ని రద్దు చేశాయి. దీంతో ఇంధన సరఫరా తగ్గింది. ఫలితంగా పలు బంకుల వద్ద డీజిల్ నోస్టాక్ బోర్డులు దర్శనమిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే ఏపీ పౌరసరఫరాల శాఖ కమిషనర్ ఆయిల్ కంపెనీల ప్రతినిధులతో చర్చించారు. ప్రస్తుత అవసరాలకు 10 శాతం అదనంగా ఇంధన సరఫరా చేసేలా ఆయిల్ కంపెనీలను ఒప్పించినట్లు తెలిసింది. దీంతో త్వరలోనే పరిస్థితులు సాధారణ స్థాయికి చేరుకుంటాయని అధికారులు చెప్తున్నారు. అయితే డీజిల్ కొరత కారణంగా గోదావరి జిల్లాలతో పాటుగా విశాఖ, అల్లూరి జిల్లా ప్రజలు ఎక్కువగా ఇబ్బంది పడుతున్నారు.

# ఆరోగ్యవంతులైన పౌరులే దేశానికి అసలైన సంపద



భద్రాద్రి కొత్తగూడెం, : ఆరోగ్యవంతులైనా పౌరులే దేశానికి అసలైన సంపద అని, మనం తీసుకునే ప్రతి ముద్ద మన ఆరోగ్యానికి పెట్టుబడి కావాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అడిషనల్ కలెక్టర్ విద్యాచం దన అన్నారు. స్థానిక సమీకృత కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా మహిళా, శిశు, దివ్యాంగ, వయోవృద్ధుల సంక్షేమ శాఖ జిల్లా అధికారిణి జె.స్వర్ణలత లెనీనా ఆధ్వర్యంలో జిల్లా స్థాయి పోషణ పక్వాడ ముగింపు కార్యక్రమం, అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యను అభ్యసించిన విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే, అక్షరాభ్యాసం, అన్నప్రసన, గర్భిణీలకు శ్రీమంతాలు, జిల్లా స్థాయిలో పోషణ పక్వాడ కార్యక్రమంలో భాగంగా అత్యున్నత ప్రతిభ కనబరిచిన జిల్లా స్థాయి సీడీపీఓలకు, సూపర్‌వైజర్లకు, పోషణ అభియాన్ సిబ్బందికి, అంగన్‌వాడీ టీచర్లకు మోమెంటో, ప్రశంసా పత్రాలు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ విద్యచందన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. ఈ పోషణ పక్వాడ స్ఫూర్తిని ఈ 15 రోజులే కాకుండా, ఏడాది పొడవునా కొనసాగించే విధంగా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యచరణ రూపొందించి అంగన్‌వాడీ కేంద్రాలలో నమోదైన లబ్ధిదా రులకు నాణ్యమైన పౌష్టికాహారం అందజేయాలని కోరారు. 2026 పూర్తి అయ్యే నాటికి మన జిల్లా పోషకాహారలోప రహిత జిల్లాగా నిర్మించుకోవాలనే లక్ష్యం పెట్టుకుని క్షేత్రస్థాయిలో సిబ్బంది పని చేయాలని, కేవలం ఆహారం తినడం వేరు, శరీరానికి కావాల్సిన విటమిన్లు, ఖనిజాలు అందేలా 'పోషక విలువలు' ఉన్న ఆహారం తీసుకోవడం వేరు అని వివరించారు. జిల్లా సంక్షేమ అధికారిణి జె. స్వర్ణలత లేనినా మాట్లాడుతూ.. పోషణ పక్వాడ 2026 కార్యక్రమంలో భాగంగా జిల్లాలో ఉన్న 2,061 అంగన్‌వాడీ కేంద్రాలలో నమోదైన లబ్ధిదారులతో పాటు ప్రజలలో కూడా పౌష్టికాహార విలువలపై అవగాహన పెంపొందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ డెవలప్‌మెంట్ ఆఫీసర్ విజయలక్ష్మి, జిల్లా ఎస్సీ డెవలప్‌మెంట్ ఆఫీసర్ శ్రీలత, వైద్య విద్య శాఖ అధికారులు సతీష్, డాక్టర్ రాకేష్, జిల్లాలోని సీడీపీఓలు, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు, పోషణ అభియాన్ సిబ్బంది, జిల్లా మహిళా సాధికారిత సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి



తుంగతుర్తి, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు ,టిపిసిసి ఉపాధ్యక్షులు కొండేటి మల్లయ్య అన్నారు. తుంగతుర్తి మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 6 మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాయకులు కార్యకర్తలతో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలు ప్రజల గుండెల్లో నిలిచిపోయాయని అన్నారు. నియోజకవర్గంలో సుమారు 2000 కోట్లతో అభివృద్ధి పనులు కొనసాగుతున్నట్లు తెలిపారు.ప్రస్తుతం గ్రామాల్లో ఎన్ఆర్ఈజీఎస్ కింద సిసి రోడ్లు, వేగంగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు కొనసాగుతున్న అని తెలిపారు. రానున్న రోజుల్లో నియోజకవర్గానికి 3500 రెండో విడత ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కానున్నట్లు పేర్కొన్నారు. గ్రామాల్లో ఎంపీటీసీ జడ్పిటిసి నిలబడే అభ్యర్థుల పేర్లను ముందస్తుగా గుర్తించి, ప్రత్యేక సమావేశంలో పొందపరిచి, అభ్యర్థుల ప్రక్రియ జగనన్నట్లు తెలిపారు. పార్టీ కోసం పనిచేస్తున్న సీనియర్లకు ఎక్కువ అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.రగులుతున్న నిప్పురవ్వ రేవంత్ రెడ్డి, అని ఒక పద్య రూపంలో పాడి, కార్యకర్తల్లో జోష్ నింపారు. ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు గుడిపాటి నరసయ్య, జిల్లా మహిళా అధ్యక్షురాలు తిరుమల ప్రగడ అనురాధ కిషన్ రావు రైతు సంక్షేమ కమిషన్ సభ్యులు చెవిటి వెంకన్న యాదవ్, డిసిసి ఉపాధ్యక్షులు యోగానంద చారి, మార్కెట్ చైర్మన్ గిరిధర్ రెడ్డి వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న, మండల పార్టీ అధ్యక్షులు దొంగరి గోవర్ధన్ నాగం సుధాకర్ రెడ్డి తోడుసు లింగ యాదవ్ ఆవిలమల్లు యాదవ్, సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు బికోజి నాయక్, రేగటి రవి గౌడ్, దాయం ఝాన్సీ రెడ్డి, పెదబోయిన అజయ్ కొండారాజు మాచర్ల అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## జనగణనను పకడ్బందీగా నిర్వహించాలి- కలెక్టర్

ఆదిలాబాద్, : జిల్లాలో జనగణన-2027 ప్రక్రియను అత్యంత పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులకు ఆదేశించారు. ఆదిలాబాద్ పట్టణంలోని టీటీడీసీ కేంద్రంలో ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లకు ఏర్పాటు చేసిన రెండవ దశ శిక్షణా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భం గా అధి కారులకు జనగణన కిట్లను కలెక్టర్ అందజేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జనగణన ప్రక్రియలో భాగంగా హౌస్లిస్టింగ్, హౌసింగ్ సెన్సస్ పనులను ఎలాంటి లోపాలకు తావులేకుండా పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. ఈసారి జనగణనను పూర్తిస్థాయిలో డిజిటల్ విధానంలో నిర్వహిస్తున్న ట్లు తెలిపారు.క్షేత్రస్థాయిలో వివరాల సేకరణ కోసం 'సెన్సస్ మేనేజ్మెంట్ అండ్ మానిటరింగ్ సిస్టమ్' వంటి ఆధునిక యాప్లు, పోర్టల్స్ను వినియోగంలోకి తీసుకొచ్చినట్లు వెల్లడించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా ఉపయోగించడం ద్వారా గణాంకాల్లో ఖచ్చి తత్వం పెరుగుతుందని, పొరపాట్లు నివారిం చవచ్చన్నారు. జనగణన నమోదు ప్రక్రియను రెండు విడతల్లో చేపడుతున్నట్లు కలెక్టర్ వివరించారు. ముం దుగా ప్రజలు స్వయంగా తమ వివరాలను నమోదు చేసుకునే అవకాశం కల్పించినట్లు తెలిపారు.అనంతరం మే 11 నుండి జూన్ 9 వరకు ఎన్యుమరేటర్లు ఇంటింటికీ వెళ్లి గృహాల జాబితాను సేకరిస్తారని చెప్పారు. జనగణన ద్వారా ప్రజల సంక్షేమం అనే నినాదంతో ప్రతి పౌరుడి వివరాలు నమో దు కావాల్సిన అవసరం ఉందని, ఈ విషయంలో సిబ్బంది పూర్తి అవగాహనతో పని చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

## జాబ్ కార్డు ఉన్న వారు ఉపాధి హామీ పనిలో చేరండి

బోథ్: జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరు ఉపాధి హామీ పనిలో చేరాలని ఎంపీడీవో రమేష్ ,ఏపీవో జగ్గిరావును కోరారు. శనివారం మండలంలోని కనుగుట్ట ,కౌట( బిశ్రీ సాంగ్వి గ్రామాలలో చేపడుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు కూలీలతో వారికున్న సందేహాలను నివృత్తి చేశారు ప్రతి ఒక్కరు ఉపాధి హామీ పనిని పూర్తి చేసుకు న్నట్లయితే సకాలంలోనే అందుకు సంబంధించిన కూలి డబ్బులు వస్తాయి అని పేర్కొన్నారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున ఉదయం పూట పనికి రావాలని సూచించారు. కొలతల ప్రకారం డబ్బులు వస్తాయని ఈ విషయంలో ఎలాంటి అనుమానాలు లేవన్నారు. వారి వెంట ఆయా గ్రామాల సర్పంచులు ఓరుగంటి స్వామి ,లలిత, ఈసీ మధుకర్ .పీఏ నరేష్ .ఎస్ఏ రాంసింగులు ఉన్నారు.

## నిరుపేదల సొంతింటి కల నెరవేరింది

వరంగల్: వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని నిరుపేదలకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్లు పథకం ద్వారా సొంతింటి కల నెరవేరుతున్నందుకు ఎంతో సంతోషంగా ఉందని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తెలిపారు.ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యాచరణలో భాగంగా హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గానికి చెందిన వివిధ డివిజన్లలోని 256 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ఇండ్లు అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని,ఎలాంటి దళారి వ్యవస్థ లేకుండా పారదర్శకంగా పథకాన్ని అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు.రేషన్ కార్డులు, పింఛన్లు, ఉచిత విద్యుత్తు, మహిళలకు మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత ప్రయాణం, రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీ వంటి అనేక సంక్షేమ పథకాలను రాష్ట్ర ప్రభుత్వం సమర్థవంతంగా అమలు చేస్తోందన్నారు.ఇప్పటివరకు 80 శాతం హామీలను నెరవేర్చామని, మిగిలిన వాటిని కూడా దశలవారీగా అమలు చేస్తామని తెలిపారు.ఇంటి స్థలం లేని నిరుపేదలకు జీ ప్లస్ త్రీ విధానంలో ఇండ్లు నిర్మించేందుకు చర్యలు చేపడుతున్నామని, లబ్ధిదారుల కళ్లల్లో కనిపిస్తున్న ఆనందం ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని తెలిపారు.ఈ కార్యక్రమంలో కాజీపేట డిప్యూటీ కమిషనర్ బిర్రు శ్రీనివాస్, నగర మేయర్ గుండు సుధారాణి, జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎండి అజీజ్ ఖాన్, కార్పొరేటర్లు తోట వెంకటేశ్వర్లు, ఏనుగుల మానస రాంప్రసాద్, జక్కుల రవీందర్ యాదవ్, విజయశ్రీ రజాలి, తదితరులు పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల నెరవేర్చిన సర్కార్ ప్రజా ప్రభుత్వంలో రాష్ట్రంలోని ప్రతి పేదవారి సొంతింటి కల నెరవేరుతుందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. ఉట్నూర్ మండలంలోని చాందూ రి, నాగపూర్, ఫకీర్ గుట్టలో నూతన ఇందిరమ్మ ఇండ్ల గృహ గృహప్రవేశంలో పాల్గొని లబ్ధిదారులతో కలిసి గృహప్రవేశం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ లబ్దిదారులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇప్పుడిప్పుడే మహిళలు ఆర్థికంగా స్థిరపడుతున్నారని, నిరుద్యోగులు ఉద్యోగాలు పొం దుతున్నారన్నారు. విద్యార్థులు ఉన్నత విద్య చదువుతూ మంచి భవిష్యత్ వైపు అడుగులు వేస్తున్నారని, మరెన్నో అబివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజా ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. సంక్షేమ పథకాల అమలు లో అధికారుల పాత్ర కీలకంమని పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్ర మాలను ప్రజా ప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ నాయకులు ప్రజలకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, అధికారులు, ఇందిరమ్మ లబ్దిదారులు తదితరులు పాల్గొన్నారు.

## యాదగిరిగుట్టలో హైదరాబాద్ సీపీ



యాదగిరిగుట్ట,: పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని కుటుంబ సమేతంగా దర్శించు కున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ దంపతులకు ఆలయ అధికారులు, అర్చకులు ఘనంగా స్వాగతం పలికారు.ముందుగా ధ్వజస్థంభానికి మొక్కులు చెల్లించుకున్న సీపీ, అనంతరం గర్భాలయంలోని స్వయంభూ లక్ష్మీ నరసింహ స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆయనకు వేదాశీర్వచనం అందించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దివ్య క్షేత్రంలోనిత్య పూజా కైంకర్యాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. సుప్రభాత సేవతో స్వయంభులను మేల్కొల్పిన అర్చకులు గర్భగుడిలో కొలువు దీరిన స్వయంభులను సువర్ణ ప్రతిష్టమూర్తులను వేదమంతోత్సవములు, మంగళ వాయిద్యాల నడుమ పంచామృతాలతో అభిషేకించి తులసీదళాలలను అర్పించారు. ప్రాకారమంటపంలో సుదర్శన నరసింహ హోమం, నిత్య కళ్యాణం పండితులు ఘనంగా నిర్వహించారు. భక్తులు కల్యాణోత్సవంలో పాల్గొని మొక్కలను చెల్లించుకున్నారు. సాయంత్రం స్వామివారి వెండి జోడు సేవలో స్వామివారిని అలంకరించి తిరువీధులలో ఊరేగించారు. కొండపైన అనుబంధ ఆలయం శ్రీ రామలింగేశ్వర శివాలయంలో నిత్య కైంకర్యాలను పండితులు నిర్వహించారు. పాత గుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో నిత్య పూజలను పండితులు నిర్వహించారు. శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానం కు వివిధ శాఖల నుండి వచ్చిన ఆదాయం 15,92,535 వచ్చినట్టు ఆలయ అధికారులు తెలిపారు.

## జవాబుదారీతనంతో వ్యవహరించాలి: కలెక్టర్

భీమిని, : ప్రజాప్రతినిధులు ప్రజలకు జవాబుదారీ తనంతో వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నా రు. భీమిని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన గ్రామసభకు అధికారులతో కలిసి హాజరై కలెక్టర్ మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పంచాయితీ రాజ్ వ్యవస్థ ద్వారా గ్రామ అభివృద్ధికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని, పరిపాలన సౌలభ్యం కొరకు గ్రామ సర్పంచ్, ఎంపిటిసి, ఎంపిపి, జిల్లా పరిషత్ వ్యవస్థల ద్వారా ప్రభుత్వం మంజూరు చేసిన అభివృద్ధి పనులను చేపట్టడం జరుగుతుం దన్నారు.క్షేత్రస్థాయిలో స్థానిక ప్రజా ప్రతినిధులకు సమస్యలపై పూర్తి అవగాహన ఉంటుందని, తద్వారా సమస్యల పరిష్కారం సులభతరం అవుతుందని, అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షే మ ఫలాలు అందుతాయన్నారు. ఉపాధి హామీ పథకం, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు వంటి ప్రభుత్వం పథకాలు విజయవంతం కావడంలో ప్రజల భాగస్వామ్యం అవసరమని సూచించారు. గ్రామ అభివృద్ధిలో భాగంగా ఏర్పాటు చేసిన గ్రామసభకు అధికారులు, ప్రజాప్రతి నిధులు బాధ్యతలు హాజరుకావాలని, గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు ఆస్కా రం ఉంటుం దన్నారు.అనంతరం కన్నెపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి ఆసుపత్రిలోని వార్డులు, మందుల నిల్వలు, పరిసరాలను కలెక్టర్ పరిశీలించారు. వేసవి అయినం దున వడదెబ్బకు గురికాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను ప్రజలకు వివరించాలని సూచించారు. ఆసుపత్రికి వచ్చే వారికి మెరుగైన వైద్య సదుపా యాలు అందించాలని, వైద్యు లు, సిబ్బంది విధుల్లో సమయపాలన పాటించాలన్నారు.

## పార్టీ సరైన మార్గంలో నడిస్తే.. ఎంపీలు పార్టీ వీడేవారు కాదు:

### సామాజిక కార్యకర్త హన్నా హజారా



న్యూఢిల్లీ: ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన రాఘవ్ చద్దా తో పాటు మరో ఆరు మంది రాజ్యసభ ఎంపీ లు ఆ పార్టీని వీడిన విషయం తెలిసిందే. ఆప్‌కు గుడ్‌బై చెప్పిన ఆ ఎంపీలు బీజేపీలో చేరా రు. అయితే ఈ నేపథ్యంలో సామాజిక కార్యకర్త హన్నా హజారా మాట్లాడారు. ఒకవేళ ఆమ్ ఆద్మీ పార్టీ సరైన మార్గంలో పయనిస్తే, బహుశా రాఘవ్ చద్దాతో పాటు ఇతర ఎంపీలు కూడా పార్టీని వీడేవారు కాదు అని అన్నాహజారే అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతి ఒక్కరికీ హక్కు ఉంటుందని, బహుశా ఆ ఎంపీలు ఏదైనా సమస్యను ఎదుర్కొని ఉంటారని, అందుకే వాళ్లు పార్టీ వీడినట్లు తెలుస్తోందన్నారు. మహారాష్ట్రలోని అహల్యనగర్ జిల్లాలో రిపోర్టర్లతో అన్నాహజారే మాట్లారు. అన్నాహజారేతో కలిసి ఆమ్ ఆద్మీ పార్టీ ముఖ్యనేత కేజ్రీవాల్ అవినీతి ఉద్యమం సాగించిన విషయం తెలిసిందే. ఆప్ రాజ్యసభ ఎంపీలు రాఘవ్ చద్దా, సందీప్ పతాక్.. ఢిల్లీలో శుక్రవారం మీడియా సమావేశం నిర్వహించి.. ఆ పార్టీని వీడుతున్నట్లు వెల్లడించారు. ఆప్ రాజ్యసభ సభ్యుల్లో మూడో వంతు పార్టీని వీడుతున్నట్లు చద్దా తెలిపారు. ఆమ్ ఆద్మీ పార్టీలో నాయకత్వ లోపం తలెత్తిందని, ఒకవేళ ఆ పార్టీ కనుక సరైన మార్గంలో పయనిస్తే, బహుశా వాళ్లు పార్టీని వదిలి వెళ్లేవారు కాదని అన్నాహజారే అన్నారు.

## మే మొదటి వారం నుంచే భూముల ధరలు పెంపు..



హైద్రాబాద్: తెలంగాణలో భూముల మార్కెట్ విలువలను మే మొదటి వారం నుంచి సవరించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నేతృత్వంలోని మంత్రుల ఉపసంఘం దీనిపై అధికారులకు దిశానిర్దేశం చేసింది. ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్ మధ్య చైనా తరహా పారిశ్రామిక పార్కుల ఏర్పాటుకు సానుకూలత వ్యక్తం చేయడంతో పాటు 'హిల్ట్' విధానం ద్వారా పారదర్శక పద్ధతిలో భూ వినియోగ మార్పిడి చేపడతామని స్పష్టం చేసింది. పారిశ్రామికవేత్తల సూచనల మేరకు రాయితీలు, కొత్త జోన్ల కేటాయింపుపై ప్రభుత్వం దృష్టి సారించింది.తెలంగాణలో ఆదాయ వనరుల పెంపుదల, పారిశ్రామిక అభివృద్ధిపై ప్రభుత్వం దూకుడు పెంచింది. మే మొదటి వారం నుంచి సవరించిన భూముల మార్కెట్ విలువలను అమలులోకి తీసుకురావాలని రిజిస్ట్రేషన్ శాఖ అధికారులను 'ఆదాయ వనరుల సమీకరణ మంత్రివర్గ ఉపసంఘం' ఆదేశించింది. సచివాలయంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అధ్యక్షతన జరిగిన ఈ కీలక సమావేశంలో మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, శ్రీధర్ బాబు, జూపల్లి కృష్ణారావులతో పాటు పారిశ్రామిక ఎస్టేట్ల ప్రతినిధులు పాల్గొన్నారు. రాష్ట్రంలో ఆర్థిక కార్యకలాపాలను వేగవంతం చేస్తూనే.. భూ విలువల సవరణ ద్వారా ఖజానాకు అదనపు ఆదాయాన్ని చేకూర్చడమే ఈ నిర్ణయం ప్రధాన ఉద్దేశ్యంగా ప్రభుత్వం చెబుతోంది.ఈ సమావేశంలో పారిశ్రామిక రంగానికి సంబంధించి అనేక వినూత్న ప్రతిపాదనలు చర్చకు వచ్చాయి. ముఖ్యంగా హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు, రీజినల్ రింగ్ రోడ్డు మధ్య ఉన్న ప్రాంతాలను చైనా తరహాలో ప్రత్యేక పారిశ్రామిక పార్కులుగా అభివృద్ధి చేయాలని పారిశ్రామికవేత్తలు కోరగా.. ప్రభుత్వం దానికి సానుకూలత వ్యక్తం చేసింది. హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్స్ ట్రాన్స్‌ఫర్మేషన్ (హిల్ట్) విధానాన్ని ప్రజాస్వామ్యబద్ధంగా ఎటువంటి నగదు బదిలీలకు తావులేకుండా అమలు చేస్తామని భట్టి విక్రమార్క హామీ ఇచ్చారు. పరిశ్రమల వల్ల కాలుష్యం ఉండకూడదని అదే సమయంలో అవి లాభసాటిగా నడవాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు.అయితే హిల్ట్ పాలసీపై రాజకీయంగా తలెత్తుతున్న కొన్ని విమర్శలను పారిశ్రామిక సంఘాల ప్రతినిధులు కొట్టిపారేశారు. చర్లపల్లి ఇండస్ట్రియల్ ఎస్టేట్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. ఈ విధానం వల్ల భవిష్యత్తులో ఇబ్బందులు వస్తాయని కొందరు నేతలు భయపెట్టే ప్రయత్నం చేశారని కానీ పారదర్శకమైన ఈ విధానంలో ఎవరికీ అనుమానాలు అవసరం లేదని తాము భావిస్తున్నట్లు తెలిపారు. భూ వినియోగ మార్పిడి ఛార్జీలను రోడ్డు విస్తీర్ణాన్ని బట్టి 30 శాతం నుంచి 50 శాతం వరకు నిర్ణయించారని అయితే వీటిని స్వల్పంగా తగ్గించాలని పారిశ్రామికవేత్తలు విజ్ఞప్తి చేశారు. రాయితీలు ఇవ్వకపోయినా సరే పరిశ్రమల స్థాపనకు తగినంత భూమిని కేటాయించాలని వారు కోరారు.మరోవైపు, రాష్ట్రంలోని అన్ని శాఖల పరిధిలో ఉన్న భూముల వివరాలను సమగ్రంగా సేకరించాలని మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులను ఆదేశించారు. ఖాళీగా ఉన్న భూములు, ఆక్రమణకు గురైన ప్రాంతాలు, ప్రభుత్వానికి అందుబాటులో ఉన్న స్థలాల డేటాను సిద్ధం చేయాలని సూచించారు. అన్ డెవలప్డ్ ల్యాండ్ పాలసీ కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రైవేటు భాగస్వామ్యంతో పారిశ్రామిక పార్కులను అభివృద్ధి చేసే దిశగా అడుగులు వేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ నిర్ణయాలు రాష్ట్రంలో పారిశ్రామిక రూపురేఖలను మార్చడమే కాకుండా.. పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలను సృష్టించే అవకాశం ఉంది.

## ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి: కలెక్టర్



నల్లగొండ: మునుగోడు మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సర్పంచ్ పాలకూరి రమాదేవి ఉదయం సందర్శించారు. ధాన్యం కొనుగోళ్లపై ఇబ్బందులను రైతులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని, రైతులను ఇబ్బందులు పెట్టకుండా చూడాలని సంబంధిత అధికారులతో సెల్‌ఫోన్‌లో మాట్లాడారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈ క్రమంలో మునుగోడుకు వచ్చిన జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ కు ధాన్యం కొనుగోళ్ల ఇబ్బందులపై సర్పంచ్ పాలకూరి రమాదేవి వివరించారు. రైతులను ఇబ్బందులు పెట్టకుండా ధాన్యం కొనుగోలు చేయాలని కోరారు. స్పందించిన కలెక్టర్ వాహనాలను ఎక్కువగా ఏర్పాటు చేసి నిర్లక్ష్యం చేయకుండా కొనుగోలు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. స్టెరిలైజేషన్ కేంద్రం ఏర్పాటు పరిశీలన మునుగోడులో కుక్కల స్టెరిలైజేషన్ కేంద్రం ఏర్పాటుకు భవనాన్ని గుర్తించడాన్ని కలెక్టర్ చంద్రశేఖర్ పరిశీలించారు. కుక్క కాటు ఘటనలు పెరిగిపోతుండడంతో వీధి కుక్కల సంతతిని తగ్గించే ప్రక్రియను ప్రభుత్వం చేపడుతుందని, కుక్కలను పట్టుకునే బృందాలను ఏర్పాటు చేసి నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామని ఈ సదర్భంగా కలెక్టర్ తెలిపారు. మండల కేంద్రంలో త్వరితగతిన కేంద్రం ఏర్పాటు చూడాలని తాసీల్దార్ నరేష్, సర్పంచ్ పాలకూరి రమాదేవి నరసింహ గౌడ్ కు కలెక్టర్ సూచించారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ శ్రీదేవి, ఎంపీడీఓ యుగంధర్ రెడ్డి, సెక్రటరీ రాజశేఖర్ రెడ్డి, పాలకూరి రమాదేవి నరసింహ గౌడ్ ఉన్నారు.

Printed, Published and Owned by SAYED PASHA Printed at MUSKAN PRINTERS, H.No. 5-12-391/1/1, Srinivas Colony BTS Nalgonda, Dist. Nalgonda. Pin-508001, Telangana State,
Published From: MUSKAN PRINTERS, H.No. 5-12-391/1/1, Srinivas Colony BTS Nalgonda, Dist. Nalgonda. Pin-508001, Telangana State.
Editor: SAYED PASHA, RNI No. RNI NO. TEITEL 2010/34557, Cell: 9849758280